
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 22.6
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 3 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.80 (299.7430)	1,88,938	1,88,938
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.75 (4.13)	2,530.24	2,679.72
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.6174 (37.8181)	1,79,000	1,76,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.125	డ్రెస్ : రూ.190	స్కిన్‌లెస్ : రూ.220

పంచాయతీ ఓటర్లు 10.73లక్షల మంది



- ఓటర్ల తుదిజాబితా విడుదల
- 869 పంచాయతీల్లో 7,494 వార్డులు

నల్లగొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో సహా ఓటర్ల తుదిజాబితా వెలువడింది. జిల్లాలో 33 మండలాల్లోని 869 గ్రామపంచాయతీలకు, 7,494 వార్డుల్లో 10,73,506 మంది ఓటర్లు నమోదయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 28 నుంచి ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సంఘం సూచించిన ప్రకారం జిల్లాలో తుది ఓటర్ల జాబితా వెలువరించిన అధికారులు, రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సైతం అందుబాటులో ఉంచారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక గ్రామపంచాయతీలతో పాటు, అత్యధిక ఓటర్లు కలిగిన జిల్లాగా నల్లగొండకు స్థానం దక్కిందని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తెలిపారు.

అత్యధిక ఓటర్లు మిర్యాలగూడ మండలంలో

జిల్లాలోని గ్రామపంచాయతీల్లో మొత్తం 10,73,506 మంది ఓటర్లు నమోదుకాగా,అందులో అత్యధికంగా మిర్యాలగూడమండలంలో 55,180 మంది ఓటర్లు ఉన్నారు.అత్యల్పంగా గుడిపల్లి మండలంలో 12,271 మంది ఓటర్లు నమోదయ్యారు.అత్యధికంగా మిర్యాలగూడలో 46పంచాయతీలుంటే, అత్యల్పంగా గట్టుప్పల్‌లో ఏడు గ్రామపంచాయతీలు ఉన్నాయి.

ఒకే వార్డులో కుటుంబ సభ్యుల ఓట్లు

గతానికి భిన్నంగా ఈసారి పంచాయతీ ఓటర్ల జాబితాలను అధికారులు పకడ్బందీగా రూపొందించారు. వార్డుల వారీగా పక్కా జాబితాలు ఫొటోలతో సహా ఓటర్లను నమోదు చేశారు. అంతేగాక ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా రూపొందించారు. ఇంటిపక్క ఇళ్లు ఉన్న వారు ఓట్లు కూడా ఒకే వార్డులో ఉండేలా చూడడంతో పాటు, వార్డుకు కేటాయించిన ఓటర్లకు మించిన చోట ఒకటి, రెండు ఇళ్లు ఎక్కువ తక్కువ ఉన్నా ఆ వీధి, లేక వాడ అంతా ఒకేవార్డులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు దాదాపు రెండు నెలలుగా ఈ కసరత్తును నిర్వహించారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. చిన్న పంచాయతీలకైతే ఒకే లోకేషన్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. 1,000 ఓట్లు దాటిన చోట ప్రభుత్వ స్కూళ్లతో పాటు, గ్రామపంచాయతీభవనాలు..

- మిగతా 8వ పేజీలో...

ఓటరు జాబితాలను ప్రచురించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలను ప్రచురించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఇందిరమ్మ ఇళ్లు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, వీధి కుక్కలు తదితర విషయాలను ఆమె సమీక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో తొలి ఓటరు జాబితాను ప్రచురించాలన్నారు. ఎక్కడైనా తాత్కాలిక పోలింగ్ కేంద్రాలు అవసరం ఉంటే ప్రతిపాదించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులతో దరఖాస్తు చేయించాలన్నారు. సమీక్షలో ఆర్డీవో రమణారెడ్డి, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అందరూ అర్హులే

(ఆంధ్రజ్యోతి, డిండి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అంతా అర్హులేనని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం డిండి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి 2017, ఏప్రిల్ 1 తరువాత మృతిచెందిన వారని అర్హులని, వారు మరణించేనాటికి 18 నుంచి 59 సంవత్సరాలలోపు వయసు ఉండాలన్నారు. మండలంలో 579 మొత్తం దరఖాస్తులు రాగా, 152 పరిశీలించినట్లు తెలిపారు. దేవరకొండ డివిజన్‌లో 4వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. మండలంలో 326 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 41,525 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న, ప్రతేకాధికారి లక్ష్మీ ఉన్నారు.

నిమజ్జనానికి పటిష్ఠ భద్రత

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం స్థానిక వల్లభరావు చెరువును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, పోలీసులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిమజ్జన ప్రాంతానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్, భారీకేడ్లు, క్రేన్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, తదితర ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



డిండి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సర్వర్ బిజీ

- ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ కష్టాలు
- ఆలస్యానికి చెల్లుచీటీ
- ఇప్పటికే విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలు

విద్యాశాఖలో ఇప్పటికే విద్యార్థులకు అమలు చేస్తున్న ఫేసియల్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ఉపాధ్యాయులకూ అమలులోకి వచ్చింది. ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలలకు హాజరయ్యేలా ఈ విధానాన్ని అమలుచేస్తుండగా, టీచర్ల ఆలస్యపు హాజరుకు చెల్లుచీటీ పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఉదయం 9.05గంటలకే ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉండగా, ఉపాధ్యాయులు ఉరుకులు పరుగులతో పాఠశాలలకు చేరుకుంటున్నారు. అంతా ఒకేసారి యాప్ వినియోగిస్తుండటంతో సర్వర్ బిజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ యాప్‌లో లొకేషన్, ఇంటర్నెట్ ఆధారంగా హాజరు నమోదవుతుండటంతో కనెక్టివిటీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా ఈ యాప్‌తో ఇబ్బందులు, ప్రయోజనాలు వెలుగుచూశాయి.

- **పెద్దఅడిశర్లపల్లి:** మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలలో 19 మంది ఉపాధ్యాయులు 15 మంది ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేశారు. మిగతావారి నమోదులో ఇబ్బదులు ఎదురయ్యాయి.
- **డిండి:** మండలం వావిల్‌కోల్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు 9.11 గంటలకు, మరో ఉపాధ్యాయుడు జి.సుధాకర్ 10.30గంటలకు హాజరయ్యారు. ఎర్రగుంటపల్లి పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు 9.50గంటలకు హాజరయ్యారు.
- **దేవరకొండ:** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 27 మంది ఉపాధ్యాయులు ఉండగా, సిగ్నల్స్, సర్వర్ మొరాయించడంతో 9.30గంటల వరకూ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదుకాలేదు.
- **నేరేడుగొమ్ము:** ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా, సర్వర్ సమస్య కారణంగా సకాలంలో హాజరు అప్‌లోడ్ కాలేదు.
- **కొండమల్లేపల్లి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 879 ఉండగా, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల హాజరుకే 45 నిమిషాల పూర్తి పీరియడ్ పడుతోంది. ఒక్కోసారి సిగ్నల్స్ రాక ఇబ్బందులు ఎదురయ్యాయి.
- **మిర్యాలగూడ రూరల్:** మండలంలోని గూడూరు ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు నమోదుచేశారు.
- **చిట్యాల, చిట్యాల రూరల్:** మండలం పెద్దకాపర్తి జడ్పీ హెచ్ఎస్‌లో సర్వర్, సిగ్నల్స్ సమస్యతో ఇబ్బందులు ఎదురయ్యాయి. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు యాప్‌లో అటెండెన్స్ అప్‌లోడ్ చేయడానికి ప్రయత్నించగా సర్వర్ బిజీ వచ్చింది.
- **నార్కట్‌పల్లి:** మండలంలో 'యువర్ ఇంటర్నెట్ కనెక్షన్ సీమ్స్ టు బీ ప్రాబ్లం' అంటూ డిస్‌ప్లే రావడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- **కేతేపల్లి:** మండలంలోని ఉప్పలపహాడ్ ప్రాథమిక పాఠశాలలో సగం మంది ఉపాధ్యాయులు చివరి నిమిషంలో పాఠశాల ఆవరణలోకి పరుగులు తీస్తూ ఎఫ్ఆర్ఎస్ నమోదుచేశారు. ప్రార్థన సమయం అవుతున్నా నిలిపి ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేశారు.



చిట్యాల జడ్పీహెచ్ఎస్‌లో యాప్‌లో హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయురాలు

'కాళేశ్వరం'పై మొదట మాట్లాడిందే రాజగోపాల్‌రెడ్డి

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే సహించం
- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



నల్లగొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై మొదటగా మాట్లాడి సమాజానికి తెలియజేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేసేవారిని సహించేది లేదని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజల కోసం కాకుండా, తమ కమీషన్ల కోసమే నిర్మిస్తున్నారని అసెంబ్లీ సాక్షిగా వెల్లడించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సోషల్‌మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన పత్రిక ప్రచురించిన తీరుగా మార్పులుచేసి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇదంతా బీఆర్ఎస్ శిబిరం నుంచి వస్తున్న దుష్ప్రచారమని అన్నారు. ప్రధాన పత్రికను తలపించేలా 'కాళేశ్వరంలో అవినీతి జరగలేదు' అని రాజగోపాల్‌రెడ్డి మాట్లాడినట్లు వార్త సృష్టించి సోషల్ మీడియాలో పెట్టించిన వారికి తగిన సమయంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం దోచుకుతింటుంటే వారికి తగిన బుద్ధి చెప్పడానికి తన పదవినే వదులుకున్న చరిత్ర కలిగిన రాజగోపాల్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంట్రాక్టర్ల కోసమే నిర్మిస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి మొదటగా మీడియాలో మాట్లాడారని అన్నారు. అవినీతి జరగలేదని ఎలా మాట్లాడుతారని, ఆ మాత్రం స్పృహలేకుండా సోషల్‌మీడియాలో పిచ్చిరాతలు రాయిస్తే ప్రజలు రాళ్లతో తరిమికొడతారని హెచ్చరించారు.



మునుగోడు కేజీబీవీలో వివరాలు తెలుసుకుంటున్న డీఈవో భిక్షపతి

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

డీఈవో భిక్షపతి

మునుగోడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన ప్రకారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం విధిగా అందించాలని డీఈవో భిక్షపతి ఆదేశించారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు స్థానిక పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఆయా పాఠశాలల్లో తరగతి గదులు, వంట గదుల్లో నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం, విద్య అందుతోందా అని విద్యార్థులను ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, లేదంటే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను, వంట ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు.

నేడు జిల్లాస్థాయి కళాఉత్సవ్

నల్లగొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఈనెల 3న ఉదయం 9.30గంటల నుంచి జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన 9వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని తెలిపారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, సినీ కళలు, చిత్రలేఖనం, బొమ్మల తయారీ, హరికథ, బుర్రకథ వంటి 12 కళారూపాలను ఈ పోటీల్లో ప్రదర్శించవచ్చని తెలిపారు. ప్రతీ కళారూపానికి ఒకరి చొప్పున ఎంపిక చేసి విజేతలను రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు పంపుతామని చెప్పారు. కళారూప ప్రదర్శనకు సంబంధించిన సామగ్రిని విద్యార్థులే వెంటతెచ్చుకోవాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న ఖమ్మంపాటి శంకర్

ఎస్ఎఫ్ఐ ఆలిండియా కమిటీ సభ్యుడు శంకర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆలిండియా కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 2019-20 నుంచి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను బకాయి ఉంచిందన్నారు. 2024 వరకు సుమారు రూ.5,358కోట్లు బకాయిలు ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ మొత్తం రూ.8,158కోట్లకు చేరిందన్నారు. దీంతో పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించేందుకు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బకాయిలు చెల్లించలేదన్నారు. దీంతో ప్రైవేట్ కళాశాలలు, విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, బుడిగ వెంకటేశ్, కోరే రమేష్, ముస్కు రవీందర్, రవి, మారుపాక కిరణ్, స్పందన, జగన్‌నాయక్, జగదీష్, పెద్ది రాములు, వీరన్ననాయక్, నవదీప్, రాకేష్, నవదీప్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని రోడ్లకు నిధులు కేటాయించాలి

మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బీటీ, అంతర్గత రోడ్లకు నిధులు కేటాయించాలని ఆర్అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వాటర్స్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే బాలునాయక్ మర్యాదపూర్వకంగా కలిసి నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, తదితరులు ఉన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఎమ్మెల్యే బాలునాయక్

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి జడ్చర్ల-కోదాడ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు విస్తరణలో భాగంగా కొలతలు వేసి మార్క్ చేసిన కట్టడాలను పరిశీలించారు. సెట్ బ్యాక్ ఉందా? లేదా? అనే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విస్తరణలో భాగంగా కట్టడాలను కోల్పోతున్న భవన యజమానులకు పరిహారం అందిందా అని ఆరా తీశారు. పట్టణ ప్రజల భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టిన రోడ్డు విస్తరణకు పరిహారం పొందిన యజమానులు నిర్మాణాలు తొలగించి సహకరించాలని కోరారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హస్ ఎదుట అంబేడ్కర్ భవన నిర్మాణానికి గుర్తించిన స్థలంలో అంబేడ్కర్ విగ్రహం, వాటర్ ఫౌంటెన్ నిర్మించనున్నట్లు తెలిపారు. సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ, పరిహారం పొందిన భవనాల యజమానులు నిబంధనల మేరకు భవనాలు తొలగించడంతో పాటు సెట్‌బ్యాక్ వదిలి కొత్త నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు భూయజమానులకు రూ.33కోట్ల పరిహారం చెల్లించామన్నారు. వారసత్వ వివాదాల కారణంగా మరో రూ.6కోట్ల చెల్లింపులు నిలిచాయని, పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ఆ మొత్తాన్ని కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ, సర్వేయర్ ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల దుర్వాసనకు చెక్

- బయోరికో ఓడౌర్ ఎలిమినేటర్ల పంపిణీ 7

వాట్సా‌ప్‌లో ఆర్టీసీ టికెట్ బుకింగ్

- హైదరాబాద్‌లోని మియాపూర్, కంటోన్మెంట్ డిపోల్లో పైలట్ ప్రాజెక్టు 6

వాట్సాప్‌లో ఆర్టీసీ టికెట్ బుకింగ్



ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులకు శ్రీకారం చుడుతున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో కొత్త విధానం అమల్లోకి తెచ్చింది. వాట్సాప్ ద్వారా టికెట్ బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. ప్రయాణికులు తమ వివరాలను వాట్సాప్‌లో నమోదుచేసి, ఈ-టికెట్ పొందేందుకు వీలుగా సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసింది. ఈ విధానంలో ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్(ఏఎఫ్‌సీఎస్)తో ప్రయాణికులు వేగంగా టికెట్ పొందవచ్చు. డిజిటల్(యూపీఐ) చెల్లింపులను ఇప్పటికే స్వీకరిస్తున్న ఆర్టీసీ వాట్సాప్ ద్వారా టికెట్ బుకింగ్ విధానం అమలుపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



- హైదరాబాద్‌లోని మియాపూర్, కంటోన్మెంట్ డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా పనితీరు పరిశీలన
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు యత్నాలు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

ఆర్టీసీ యాజమాన్యం వాట్సాప్ ద్వారా బస్ టికెట్ల జారీని ప్రయోగాత్మకంగా అమలుచేస్తోంది. హైదరాబాద్‌లోని రెండు డిపోలలో ఈ విధానాన్ని అమలుచేస్తున్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సంస్థ ప్రకటించిన మొబైల్ నెంబరుకు 'హాయ్' అని టైప్ చేస్తే ఆప్షన్లు కనిపిస్తాయి. ఆయా ఆప్షన్లను ఫాలో అవుతూ టికెట్ బుకింగ్‌తో పాటు అవసరమైతే రద్దు చేసుకోవచ్చు.

ప్రయోగాత్మకంగా...

ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్(ఏఎఫ్‌సీఎస్) సేవలను తొలుత పుష్పక్ బస్సుల్లో ప్రయాణించే వారికి అమలుచేస్తున్నారు. ఈ విధానాన్ని మియాపూర్, కంటోన్మెంట్ బస్‌డిపోల నుంచి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే బస్సుల్లో అమలుచేస్తున్నారు. త్వరలో గరుడ ప్లస్, రాజధాని, డీలక్స్, సూపర్ క్లాస్ తదితర హైఎండ్ బస్సులకు సేవలను విస్తరించనున్నారు.



బస్ పాసులు సైతం..

ప్రయాణికుల్లోని కొన్నివర్గాలకు బస్‌పాసులు జారీ చేస్తున్న ఆర్టీసీ సంస్థ ఈవిధానాన్ని డిజిటలైజేషన్ చేసింది. పేపర్ పాస్‌లకు స్వస్తి పలికి, స్మార్ట్ పాస్‌లను అందించేందుకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసింది. సంస్థ జారీ చేసిన ఈ-పాస్‌లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని బస్‌లో ప్రయాణిస్తున్న తరుణంలో కండక్టరుకు చూపిస్తే టిమ్ మిషన్ ద్వారా స్కాన్ చేసి ధ్రువీకరిస్తారు.

రాష్ట్ర రాజధానిలో ఇప్పటికే..

ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్(ఏఎఫ్‌సీఎస్) విధానం ద్వారా రాష్ట్ర రాజధానిలో ఇప్పటికే 20 శాతం టికెట్లను జారీ చేస్తున్నట్లు రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముషీరాబాద్ డిపోలో ఇటీవల పర్యటించిన మంత్రి ఈ టెక్నాలజీ వినియోగంలో ఎదురవుతున్న అనుభవాలను స్వయంగా తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఎఫ్‌సీఎస్‌ను అమలుచేస్తామని ప్రకటించారు.

TGSRTC Gamyam Track-Ride-Arrive

● ఉపయోగకరంగా గమ్యం యాప్..

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల బస్సు ప్రయాణ అనుభవాలను విప్లవాత్మకంగా మారుస్తోంది. విమానం, రైలు తరహాలో బస్సు ట్రాకింగ్ సిస్టమ్‌ను తెలియజేసేలా 'ఆర్టీసీ గమ్యం' యాప్‌ను ఇప్పటికే తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు తాము ప్రయాణించే బస్ ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు. బస్సు కోసం ఎదురుచూడకుండా సమయాన్ని ఆదా చేసేందుకు ఈ యాప్ దోహదపడుతోంది. అయితే ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో గమ్యం యాప్ సాఫ్ట్‌వేర్‌ను సాధారణ బస్సుల నుంచి ఈ-బస్సులకు తరలించే తరుణంలో స్వల్ప సాంకేతిక సమస్యలు ఏర్పడినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు.



ప్రయాణికుల సౌలభ్యం కోసమే..

ప్రయాణికులకు సులభతరమైన సేవలందించేందుకు టీఎస్‌ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే డిజిటల్ సేవలను ప్రోత్సహిస్తున్నాం. పలు విభాగాలలో ఏఐ సేవలను ప్రవేశపెట్టి ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నాం. వాట్సాప్ ద్వారా బస్ టికెట్స్ జారీ చేసే సాంకేతికతను రాష్ట్రరాజధాని హైదరాబాద్‌లోని రెండు డిపోల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. అమలులో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలకు ఆయా సేవలను విస్తరించే అవకాశం ఉంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం సంస్థ పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది.

కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ (నల్లగొండ)

గుర్తు తెలియని వాహనం ఢీకొని

యువకుడి మృతి

తిరుమలగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే కృష్ణ(25) తిరుమలగిరిలో పనులు ముగించుకొని నడుచుకుంటూ వెళ్తున్నాడు. సూర్యాపేట రోడ్డులో ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణ తల్లి అంజమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పాముకాటుతో మహిళా రైతు..



ధనమ్మ(ఫైల్)


తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం గోడుమడక గ్రామంలో మంగళవారం పొలంలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురై మహిళా రైతు మృతి చెందింది. మహిళారైతు కుటుంబీకులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బూడిద ధనమ్మ(39) ఇటీవలి వర్షాలకు సొంత పత్తి పొలంలో కలుపు బాగా పెరగడంతో స్వగ్రామానికి చెందిన కూలీలను తీసుకోని పొలానికి వెళ్లింది. ఈ క్రమంలో ఏపుగా పెరిగిన గడ్డిని తొలగిస్తుండగా కాలిపై పాము కాటేయడంతో వెంటనే గట్టిగా అరిచింది. దీంతో అప్రమత్తమైన పక్కనే ఉన్న కూలీలు స్పృహ తప్పిన ధనమ్మను సాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగానే ధనమ్మ మృతిచెందింది. ధనమ్మకు భర్త, ఇద్దరులు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ధనమ్మ పాముకాటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు

చిట్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గోగికార్ మాధవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. ఇదే పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వరిస్తున్న సమయంలో పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధుల దుర్వినియోగం చేశారన్న ఫిర్యాదులతో డీఈవో విచారణకు ఆదేశించారు. ఈ నెల 1న విచారణకు వచ్చిన జిల్లా ఫైనాన్షియల్ అకౌంట్స్ ఆఫీసర్ యోగేంద్రనాధ్, ఎంఈవో పోనుగోతు సైదానాయక్‌కు ఆమె సహకరించకపోవడంతో పాటు వారు స్వాధీనం చేసుకున్న రికార్డులను లాక్కోవడానికి ప్రయత్నించింది. విధులకు ఆటంకం కలిగించడంతో అదేరోజు వారు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రాగిజావ

- అమలుకు ప్రభుత్వం నిర్ణయం
- ఒక్కో విద్యార్థికి వారంలో మూడు రోజుల పాటు అందజేత
- 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లంతో జావ తయారీ



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. పోషకాహార లోపంతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్న నేపథ్యంలో వారికి రాగి జావను అందించనుంది. ఇందుకోసం ఇప్పటికే సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌తో అంగీకారం కుదిరింది. 60 శాతం ట్రస్ట్, 40 శాతం ప్రభుత్వ నిధులతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. విద్యార్థుల్లో చాలామంది పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ నివేదికలు చెబుతున్నాయి. ఆరోగ్యం విషయంలో సరిగా లేకపోతే విద్యార్థులు విద్యపై దృష్టి సారించలేరని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో పోషకాలతో కూడిన రాగిజావను అందించాలని నిర్ణయించింది.

వారంలో మూడు రోజుల పాటు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారంలో మూడు రోజుల పాటు రాగిజావను అందించనున్నారు. ఉదయం ప్రార్థనా సమయానికి ముందు అందిస్తారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిపిండి, 10 గ్రాముల బెల్లం కలిసి రాగిజావను తయారు చేయనున్నారు. ఇప్పటికే వారంలో మూడురోజులు కోడిగుడ్లు అందిస్తుండగా, మిగిలిన మూడు రోజుల్లో రాగిజావను అందించనున్నారు. రాగిజావను తయారు చేసే బాధ్యతను మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అప్పగించారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి 25 పైసల చొప్పున వారికి ఇవ్వనున్నారు. మండల రీసోర్స్ కేంద్రం నుంచి పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రాగి పిండి, బెల్లం పదార్థాలను సరఫరా చేయనున్నారు.

సూర్యాపేట జిల్లాలో 881 ప్రాఠశాలలు

జిల్లా పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 881 పాఠశాలలు ఉన్నాయి. 49వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అమలుచేస్తున్నారు. తాజాగా రాగిజావను కూడా త్వరలో అందించనున్నారు.

రాగిజావతో ప్రయోజనాలు

రాగిజావ తీసుకోవడంవల్ల అనేక ఉపయోగాలు కలగనున్నాయి.

- రాగులు, బెల్లం పదార్థాల్లో కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉంటాయి.
- రాగులు ఎముకల ఆరోగ్యానికి, ఐరన్ అలసట, రక్తహీనతను నివారించగానికి ఉపయోగపడనుంది.
- అధికఫైబర్, ప్రోటీన్ ఉండడంలో ఈ పోషకాలు జీర్ణక్రియకు, కండరాల అభివృద్ధికి తోడ్పడుతాయి.

త్వరలో అమలు చేస్తాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు త్వరలో రాగిజావను అందజేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే మధ్యాహ్నం భోజనంలో వారంలో మూడురోజులు కోడిగుడ్లు అందజేస్తున్నాం. మిగిలిన రోజులు రాగిజావను అందిస్తాం. రాగిజావతో విద్యార్థులకు పోషకాలు అందుతాయి.

అశోక్‌కుమార్, డీఈవో సూర్యాపేట.

నలుగురు కాపర్ వైర్ దొంగల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్

కోదాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లను చోరీ చేస్తున్న నలుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మార్చి, మే నెలల్లో మునగాల పరిధిలోని నాగార్జునసాగర్ కాల్వపై ఎత్తిపోతల కోసం అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరు దొంగతనం జరిగింది. ఈ చోరీలపై సంబంధిత అధికారులు, రైతులు ఫిర్యాదు మేరకు మునగాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ఆదేశాల మేరకు సాగర్ కాల్వపై పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం విశ్వసనీయ సమాచారంతో బరాఖత్‌గూడెం వద్ద నాగార్జునసాగర్ కాల్వపై అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తమది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు పట్టణానికి చెందిన పాలకుర్తి వెంకటరామయ్య, గుంటకళ్ల కాజేశ్వరరావు, బోయపాటి అశోక్‌కుమార్, దేవరకొండ ఇషాంక్‌లుగా గుర్తించారు. విచారణలో మునగాల, నడిగూడెం మండలాల పరిధిలోని నాగార్జునసాగర్ కాల్వపై ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును చోరీ చేస్తున్నట్లు వారు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. వీరితో పాటు చోరీలో భాగస్వామిగా ఉన్న మరో వ్యక్తి బలిగా శ్రీకాంత్ పరారీలో ఉన్నాడన్నారు. నలుగురి నుంచి రూ.2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో వెంకటరామయ్య గతంలో కాపర్ వైర్ దొంగతనాలు చేసిన కేసులో ఉన్నాడన్నారు. నిందితులందరికీ నేరచరిత్ర ఉందని డీఎస్పీ తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో ఒంగోలులో సెల్ఫ్ డ్రైవర్ కారు తీసుకుని కోదాడ సమీపంలోని ప్రాంతాలకు వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరు సుమారు 5 క్వింటాళ్ల కాపర్ వైరు చోరీ చేసినట్లు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐ బీ ప్రవీణ్‌కుమార్, ఐడీ పార్టీ రామారావు, కొండలు, సూర్యాపేట సీపీఎస్ ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి, సిబ్బంది, మల్లేశ్, శివ, ఆనంద్, శ్రీనులను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలకు రుష్మిత ఎంపిక



నల్లగొండ రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎస్‌సీడీడీ గర్ల్స్ బీ హాస్టల్ విద్యార్థిని మీసాల రుష్మిత ఎంపికైంది. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 పోటీల్లో ప్రతిభను కనబరిచింది. రుష్మిత నల్లగొండ పట్టణంలోని మాల్‌బౌలి బాలికల హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. విద్యార్థిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికకావడంతో ఎస్‌సీడీడీ డిప్యూటీ డైరెక్టర్ శశికళ, హాస్టల్ వార్డెన్ దూసరి భారతమ్మ, మాల్‌బౌలి పాఠశాల ప్రిన్సిపాల్ లలిత దేవిలు రుష్మితను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుష్మిత ముస్ముందు మరింత ప్రతిభ కనబరిచాలని, ఆమెకు తమ సహాయసహకారాలు ఉంటాయన్నారు.

నాణ్యత నగుబాటు

- మట్టి ఇసుకతో కమ్యూనిటీహాల్ నిర్మాణం
- ఫిర్యాదు చేసిన అంబేడ్కర్ సంఘం

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

హుజూర్‌నగర్ పట్టణంలోని 8, 9వ వార్డుల్లో విస్తరించిన గోవిందాపురంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఈ కమ్యూనిటీ హాల్ కోసం ప్రభుత్వం బీఎంఎఫ్‌టీ, సీడీపీ నిధులు రూ.20లక్షల మంజూరుచేసింది. మొదటివిడతలో రూ.5 లక్షలు, రెండో విడతలో రూ.15 లక్షలు మంజూరుచేశారు. అయితే ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. స్లాబ్ వరకు నిర్మించారు. అయితే పిల్లర్లు, బేస్‌మెట్ పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయని అంబేడ్కర్ లయన్స్‌క్లబ్ సభ్యులు కలెక్టర్, ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఇసుక, కంకర, సిమెంట్ నిబంధనల మేరకు కలపడంలేదని గ్రామస్థులు ఆరోపించారు. వాగులు, వంకల నుంచి తెచ్చిన ఇసుకలో మట్టిశాతం ఎక్కువగా ఉందనే విమర్శలు ఉన్నాయి. ఒక ఫ్లోర్ వరకు ఉపయోగపడేలా మాత్రమే పిల్లర్లు నాణ్యత లేకుండా నిర్మించినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో గతంలో నిర్మాణానికి ఉపయోగించేందుకు తెచ్చిన ఇసుక, కంకర, డస్ట్‌ను అధికారులు మరోచోటకు తరలించారు. రెండు అంతస్తుల వరకు నిర్మించేందుకు అనువుగా బలంగా నిర్మించాలని స్థానికులు, అంబేడ్కర్ సంఘం నాయకులు కోరుతున్నారు.



గోవిందాపురంలో నిర్మాణంలో ఉన్న ఎస్‌సీ కమ్యూనిటీ హాల్

నాణ్యతతో పనులు చేపట్టాలి



గోవిందాపురంలో ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి. మట్టిఇసుక, డస్ట్‌తో గ్రౌండ్ ఫ్లోర్‌లోని స్లాబ్ వరకు నిర్మించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదుచేశాం. పీఆర్ ఏఈ కూడా వచ్చి పరిశీలించారు. ఇసుక, డస్ట్‌లో నాణ్యత లేదని చెప్పారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తు కూడా నిర్మించుకునేలా పిల్లర్లు బలంగా నిర్మించాలి.

కామళ్ళ క్రాంతి, గోవిందాపురం

నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించాం

కమ్యూనిటీహాల్‌ను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ముఖ్యంగా ఇసుకలో మట్టి శాతం ఎక్కువగా ఉందని గుర్తించాం. దానిని తిరిగి పంపించాం. గోదావరి ఇసుకతో పక్కా నిర్మాణం చేయాలని సూచించాం. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తు నిర్మించుకునేందుకు స్లాబ్ వేసే సమయంలో బలమైన పిల్లర్లు ఏర్పాటుచేయాలని సూచించాం. నాణ్యత లేకపోతే బిల్లులు నిలిపివేస్తాం.

మాధవ్, పీఆర్ ఏఈ

హుజూర్‌నగర్‌లో భారీ చోరీ

రూ.60 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. రూ.60 లక్షల బంగారు ఆభరణాలు, డైమండ్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. సీఐ చరమందరాజు, ఎస్‌ఐ బండి మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన గాయం వీరభద్రారెడ్డి 30 ఏళ్లుగా హుజూర్‌నగర్‌లోని 3వ వార్డులోని ఏవీఎన్ టవర్ సెంటర్‌లో నివాసముంటున్నారు. బంధువులు చనిపోగా వీరభద్రారెడ్డి దంపతులు ఇంటికి తాళం వేసి ఆగస్టు 19న హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా ఇంటిని శుభ్రం చేయాలని పనిమనిషిని మంగళవారం పురమాయించారు. ఆమె వెళ్లి చూడగా ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. దీంతో విషయాన్ని ఆమె వీరభద్రారెడ్డికి తెలిపింది. ఆయన ఇంటికి వచ్చి చూడగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోని బెడ్‌రూమ్ డోర్లన్నీ విరగ్గొట్టి, చిందరవందరగా పడేసి ఉండడాన్ని గమనించారు. అదేవిధంగా ఇంట్లోని సేఫ్ లాకర్‌ను మెషిన్ కట్ చేయడంతో ధ్వంసమై కనిపించింది. అందులోని డైమండ్స్ పొదిగిన గోల్డ్ చౌకర్ నెక్లెస్, డైమండ్స్ పొదిగిన బంగారపు వడ్డాణం, డైమండ్స్ పొదిగిన బంగారు జూకాలు, బంగారు చెవిబుట్టలు, దిద్దులు తదితర బంగారు వస్తువులు కనిపించలేదు. మొత్తం 60 తులాల బంగారు ఆభరణాలు, డైమండ్ నెక్లెస్ చోరీకి గురైందని నిర్ధారించుకుని వీరభద్రారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్‌ఐ బండి మోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. కాగా హుజూర్‌నగర్ పట్టణంలో భారీ చోరీ జరగడం సంచలనంగా మారింది. వీరభద్రారెడ్డి కుటుంబం 12 రోజుల కిందట హైదరాబాద్‌కు వెళ్లడం గమనించిన దొంగలు చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. రెండురోజుల క్రితం మండలంలోని గోపాలపురంలోనూ రూ.20 లక్షల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి.

హామీలను ప్రభుత్వం అమలుచేయాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రిభువనగిరి జిల్లా ఇన్‌చార్జి బీరు మహేందర్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌటుప్పల్‌లో ఈ నెల 9వ తేదీన నిర్వహించే పింఛన్‌దారుల సభను విజయవంతం చేయాలని కోరారు. మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బోయ లింగస్వామి, నాయకులు అనిల్‌కుమార్, బోయ రామచందర్, బొడ్డు శ్రవణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి వికాసమే లక్ష్యంగా

'స్కూల్ రేడియో'



ధ్యానం చేస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయుడు శ్రీనివాస్

విద్యార్థికి పాఠాలు చెబితే సరిపోతుందా, మంచి వ్యక్తిత్వం, మంచి ఆలోచన విధానం కూడా వారిలో మెరుగుపడాలి కదా. ఇవే ప్రశ్నలు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కట్టెబోయిన శ్రీనివాస్‌ను ఆలోచింపజేశాయి. ఈ క్రమంలో విద్యార్థులకు నచ్చేలా, వారు మెచ్చేలా ఓ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. స్కూల్ రేడియో పేరుతో విద్యార్థులతో పలు కార్యక్రమాలు చేయిస్తున్నారు.

- వినూత్నంగా చేపట్టిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్
- యోగా, ధ్యానంతో పాటు పలు పోటీలు
- విద్యార్థుల ఆలోచనల్లో మార్పుకు అవకాశం

(ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి)

కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 879 మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల 9 గంటలకు ప్రారంభమవుతుండగా అంతకు అరగంట ముందుగానే 8.30 గంటల నుంచి 9 గంటల వరకు స్కూల్ రేడియో కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు కట్టెబోయిన శ్రీనివాస్ చేపడుతున్నారు. ప్రతి రోజూ మొదట 10 నిమిషాలు యోగ, ధ్యానంతో పాటు ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. పిల్లల్లో సమగ్ర మూర్తిత్వం, మానసిక వికాసం పెంపుకోసం పలు పోటీలు రూపొందించారు. నీతి కథలు, ఉపన్యాసం, పాటలు, మంచి అలవాట్లు, క్రమశిక్షణా-విలువలు, వ్యక్తిగత అభిప్రాయాలను విద్యార్థులు తోటివిద్యార్థులతో పంచుకుంటారు. ఇటు ఆనందంతో పాటు మానసిక వికాసానికి దోహదపడుండటంతో విద్యార్థుల హాజరు కూడా పెరిగింది. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో చురుకుదనం సహా పాఠ్య కృత్యాల్లో విరివిగా పాల్గొనే తత్వం పెరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇది భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషిగా వారు పేర్కొంటున్నారు.

సొంత ఆలోచనలు మెరుగుపడతాయి



స్కూల్ రేడియో కార్యక్రమం అనేది ఒక వినూత్న కార్యక్రమం. దీని ద్వారా విద్యార్థులకు సొంత ఆలోచనలు వస్తాయి, అంతేకాకుండా సొంతంగా కథలు చెబుతారు. పిల్లలకు ఆన్‌లైన్ డెవలప్‌మెంట్ ఉంటుంది. ఉపన్యాస పోటీల్లో నిర్భయంగా మాట్లాడే తత్వం పెరుగుతుంది. శారీరక మానసికంగా, ఆరోగ్యంగా వారు మెరుగుపడతారు.

కట్టెబోయిన శ్రీనివాస్, ఉపాధ్యాయుడు, కొండమల్లేపల్లి

ఆమెకు రక్షణ ఏదీ?

● సూర్యాపేట జిల్లాలో మహిళా ఉద్యోగులకు వేధింపులు ● అన్నిశాఖల్లోనూ తప్పని తిప్పలు

ఆకాశంలో సగం అంటారు. అవని అంతా ఆమే అంటారు. కానీ ఆమెకు రక్షణ లేకుండా పోయింది. ఇంటా, బయటా.. ఎటు చూసినా వేధింపులే. ఉద్యోగం కోసం కార్యాలయానికి వెళితే అక్కడ, పనికోసం పొలానికి వెళ్లినా అక్కడ కూడా వేధింపులే. ఇన్ని తట్టుకొని ఆమె ముందుకు సాగేదెలా.. అన్న అంశం చర్చనీయాంశమైంది. కొంత కాలంగా సూర్యాపేట జిల్లాలో మహిళా ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులపై కథనం..

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



సూర్యాపేట జిల్లాలో మహిళా ఉద్యోగులకు వేధింపుల తిప్పలు తప్పడంలేదు. వారు పనిచేసే ప్రదేశాల్లో కొంతమంది ఉన్నతాధికారుల నుంచి తీవ్ర వేధింపులకు గురవుతున్నారు. తోటి ఉద్యోగులు కూడా కొంత మంది వేధిస్తున్నారు. జిల్లాలో ఇటీవలి కాలంలో మహిళా ఉద్యోగులపై అనేక వేధింపుల ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక.. బయటకు చెప్పుకోలేక మదన పడుతున్నారు. ఉన్నతాధికారులు తమను వేధిస్తున్నా, బయటకు చెబితే ఇంకా ఒత్తిడికి గురిచేస్తారేమోనని భయపడుతున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఏఈవోగా పనిచేస్తున్న మహిళను అదేశాఖలో పనిచేసే ఏవో బాలకృష్ణ ఇబ్బందికి గురిచేయడంతో బాలకృష్ణను కలెక్టర్ సస్పెండ్ చేశారు. నూతనకల్ మండల వ్యవసాయ అధికారి మురళీబాబు సైతం వ్యవసాయ విస్తరణ అధికారి అయిన మహిళా ఉద్యోగిని వేధించాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో విచారణచేసి సస్పెండ్‌చేశారు. అదేవిధంగా నూతనకల్ మండల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వాసా ప్రవీణ్ తన కిందిస్థాయి మహిళా ఉద్యోగిని వేధింపులకు గురిచేశాడు. దీంతో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి తన తోటి ఉపాధ్యాయురాలిని వేధించాడు. దీంతో ఆయనను కూడా ఉన్నతాధికారులు విచారణ చేసి సస్పెండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళా అధికారిని తన తోటి ఉద్యోగి వేధింపులకు గురిచేస్తున్నాడని, భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఉద్యోగులకు చెప్పడంతో వారు వారించి సమస్యను పెద్దదిగా మారకుండా చూశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్‌పై ఓ విభాగానికి చెందిన జిల్లా అధికారి కళ్యాణ్‌చక్రవర్తి వేధింపులకు గురి చేయడంతో అతనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇలా నిత్యం మహిళలపై ప్రభుత్వ కార్యాలయాల్లో వేధింపులకు పాల్పడుతున్నారు. ఇటు విధుల్లో ఒత్తిడి అటు తోటి ఉద్యోగుల నుంచి వేధింపులతో మహిళలు తీవ్రమనోవేదనకు గురవుతున్నారు.

పని ప్రదేశంలో కనిపించని రక్షణ

లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 ప్రకారం మహిళలకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్‌తోపాటు ఉపాధిహామీ పనిప్రదేశాల్లో, ఇటుక బట్టీల్లో, భవన నిర్మాణ కేంద్రాల్లో మహిళల భద్రతకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నా, అది కేవలం కాగితాలకే పరిమితమవుతుంది. ఇటీవల అధికారులు 20 కమిటీలు ఏర్పాటుచేశారు. అయితే ఈ కమిటీల్లో ఉండే సభ్యులు పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, సమస్యలపై ఎలాంటి దృష్టిసారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వేధింపుల నివారణకు అవగాహన సదస్సులు నిత్యం నిర్వహించాల్సి ఉంది. అయితే ఆ దిశగా కార్యాచరణ రూపొందించడం లేదు. దీంతో మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చు

పని ప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురైతే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చు. దీంతో కమిటీ సభ్యులు అంతర్గతంగా విచారణ చేపట్టి జిల్లా అధికారి, కలెక్టర్, మహిళా శిశుసంక్షేమ అధికారికి పంపిస్తారు. విచారణలో నేరం రుజువైతే నేర తీవ్రతను బట్టి నిందితులపై 60 రోజుల్లో చర్యలు తీసుకుంటారు. బాధిత మహిళలు ఉచితంగా న్యాయ సహాయం పొందడానికి సఖికేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది.

అధికారులకు సమాచారం ఇవ్వాలి



పనిప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అంతేకాక 100కు ఫోన్ చేస్తే విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వివరాలు గోప్యంగా ఉంచుతాం.

నర్సింహ, ఎస్పీ, సూర్యాపేట

కవితపై కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

● బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య

దేవరకొండ/నార్కట్‌పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతుందని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా సహించబోమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే చెప్పారని గుర్తుచేశారు. కన్న కూతురి కంటే కూడా కష్టంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్ ముఖ్యమని తీసుకున్న నిర్ణయం హర్షించదగినదని ఆయన పేర్కొన్నారు. కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా పార్టీకి ఎలాంటి నష్టం లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. పార్టీ గీత ఎవరు దాటినా వేటు తప్పదనే సంకేతాన్ని అధిష్టానం అందరికీ ఇచ్చినట్టేనన్నారు.

జాతీయ క్యాంప్‌నకు ఆలేరు ఎన్‌సీసీ కేడెట్లు



వరంగల్ బయలుదేరిన ఎన్‌సీసీ కేడెట్లు

ఆలేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరుగుతున్న జాతీయ సమైక్యత ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ జాతీయ క్యాంప్‌నకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు హైస్కూల్‌కి చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికయ్యారు. 10 మంది కేడెట్లతోపాటు ఎన్‌సీసీ అధికారి ఎంపిక కాగా, వారు మంగళవారం బయలుదేరి వెళ్లారు. జాతీయ క్యాంప్ ఈ నెల 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతుందని, రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కేడెట్లు ఈ క్యాంప్‌నకు హాజరవుతున్నట్లు ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్ తెలిపారు. ఈ శిబిరాన్ని కేడెట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



క్షేత్రపాలకుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి, తమలపాకులు, సింధూరం, వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణపర్వాలను పాంచ రాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, ముఖ మండపంలోనిస్ఫటిక మూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 12,43,865 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.



యాదగిరికొండపై క్యూలైన్లలో భక్తుల రద్దీ

రజాకార్లను తరిమిన వీరులనుగన్న నేల ఇది

● అమరవీరుల త్యాగాలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న రామచందర్‌రావు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రజాకార్లను తరిమిన వీరులను గన్న నేల ఇది అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై దాడులు చేస్తూ.. హతమారుస్తున్న రజాకార్లపై వీరోచితంగా పోరాడి వారిని తరిమికొట్టిన గుండ్రాంపల్లి అమరవీరుల ధైర్యం వెలకట్టలేనిదన్నారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చినా కూడా తెలంగాణ ప్రాంతంలో నిజాం, రజాకార్ల పరిపాలనతో స్వాతంత్ర్యం రాకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. 1948 సెప్టెంబరు 17న తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. రజాకార్ల చేతిలో ఎంతో మంది హతమయ్యారని, వారి త్యాగాలను పాలకులు విస్మరించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ బుద్ధి తెచ్చుకోవాలని, పక్క రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలో ఇప్పటికీ విమోచన దినోత్సవాన్ని ఆయా ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. అమరుల త్యాగాలను గుర్తించడం మనందరి బాధ్యత అని అన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను రామచందర్‌రావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యే అంజిరెడ్డి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ప్రకాష్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, పాదూరి కరుణ, వీరెల్లి చంద్రశేఖర్, కొండేటి శ్రీధర్, వెంకన్న, సేపేళ్ళ మహేందర్, కళ్యాణ్‌నాయక్, నకిరేకంటి మొగులయ్య, లలూనాయక్, పిల్లి రామరాజు యాదవ్, కంకణాల నివేదిత, దినకర్, విక్రమ్‌రెడ్డి, నూకల వెంకటనారాయణరెడ్డి, పీక వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం

చౌటుప్పల్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నల్లగొండ జిల్లా పర్యటనకు వెళ్లి వస్తూ రామచందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, చౌటుప్పల్ మునిసిపాలిటీలోని లింగోజీగూడలో కొద్ది సేపు ఆగి కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని, బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి మద్దతు కూడగట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన, జిల్లా కార్యదర్శి ఆర్ దీపిక, నాయకులు దోనూరు వీరారెడ్డి, రమనగోని శంకర్, దూడల భిక్షంగౌడ్, ముత్యాల భూపాల్‌రెడ్డి, బత్తుల జంగయ్య, కడారి అయిలయ్య, ఊడుగు వెంకటేశం, వనం ధనుంజయ్య, రంగయ్య, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టు గేట్లు మూసివేత

నాగార్జునసాగర్/కేతేపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు 15రోజులుగా సాగర్ ప్రాజెక్టు 26క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం రాత్రి కృష్ణమ్మ నెమ్మదించడంతో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో క్రస్ట్‌గేట్లను మూసివేశారు. మంగళ వారం సాయంత్రం ఎగువ నుంచి వరద రాక తగ్గడంతో 5గంటలకు 8గేట్లను మూసివేసి 18గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. రాత్రి 7గంటల సమయంలో ఎగువ నుంచి వరద రాక మరింతగా తగ్గడంతో మరో 10గేట్లను మూసి వేసి 8గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. రాత్రి 9 గంటల సమ యంలో ఎగువ నుంచి వరద రాక ఇంకా తగ్గడంతో గేట్లను మూసి వేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 585.70అడుగులుగా (299.4545టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10వేల క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 5156క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,779 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 51,635 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 51,635 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

నెమ్మదించిన మూసీ... 2గేట్ల నుంచి నీటి విడుదల

హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల పరిధితో పాటు ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గత వారం రోజులుగా ప్రాజెక్టుకు కొనసాగిన ఇన్‌ఫ్లో మంగళవారం మరింత తగ్గుముఖం పట్టింది. మంగళవారం 2,679.72క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా రెండు క్రస్టుగేట్ల నుంచి 2,156.46క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 353.56క్యూసెక్కులు మొత్తం 2530.24క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీ)ల నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు మంగళవారం సాయంత్రానికి 643.75అడుగులుగా(4.13టీఎంసీ) నమోదైంది.

యూరియా దొరకదు.. కష్టాలు తీరవు



మోతె మండలం నామవరంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

మోతె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామానికి యూరియా లోడ్ వస్తుందని తెలియడంతో సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని నామవరంలో మంగళవారం తెల్లవారక ముందే రైతులు యూరియా కేంద్రం వద్ద పెద్దసంఖ్యలో క్యూ కట్టారు. ఉదయం 8గంటలకు లోడ్ లారీ వచ్చే సరికి 400మందికి పైగా రైతులు గోదాం తాళం తీయకముందే ఉన్నారు. క్యూలైన్‌లో కొందరు చెప్పులు పెట్టారు. 200 బస్తాలు మాత్రమే రావడంతో లైన్‌లో ఉన్న వారు రెండితలు ఉండడంతో పంపిణీ సమయంలో రైతులు ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు లైన్‌ల ప్రకారం పంపిణీ చేయించారు. నామవరానికి సిరికొండ సొసైటీ ద్వారా వచ్చిన లోడ్‌లో ఉన్న మిగితా బస్తాలు సర్వారం సొసైటీకి తరలించారు. అక్కడ రైతులు 500 పైబడి రైతులు ఉండడంతో పోలీసుల పర్యవేక్షణలో పంపిణీ చేశారు. మండలంలో వానాకాలం వరి సేద్యం పెరగడంతో యూరియా అంచనాలు వేయాల్సిన అధికారులు విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు.

యూరియా కోసం పడిగాపులు

తుంగతుర్తి: యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడక తప్పడం లేదు. యూరియా సరైన సమయంలో రైతులకు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం తుంగతుర్తి సొసైటీకి యూరియా వస్తుందని తెలియడంతో వేకువ జామున నుంచి రైతులు తుంగతుర్తిలోని రైతు సేవా సహకార సంఘం చేరుకొని పడిగాపులు కాస్తున్నారు. కొందరు రైతులు తమ పనులను వదులుకొని మరీ యూరియా కోసం వేచి ఉంటున్నారు. ప్రభుత్వం రైతుల కోసం యూరియాను తెప్పించాలని రైతులు కోరుతున్నారు.

వ్యర్థాల దుర్వాసనకు చెక్



- బయోరికో ఓడొర్ ఎలిమినేటర్ల పంపిణీ
- గ్రామపంచాయతీల్లో ప్రయోగాత్మక ప్రయత్నం
- ఫలితాలను బట్టి క్రమంగా వాడకంపై నిర్ణయం
- వ్యర్థాల డీ కంపోజ్‌కు పరిష్కారం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో బాధ్యతారాహిత్యంగా పడవేసే వ్యర్థాలతో అటు పర్యావరణానికి ఇటు జీవావరణానికి కలుగుతున్న హానిని దృష్టిలో ఉంచుకుని కొత్త రకం ప్రయోగానికి జిల్లా పాలనా యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించింది. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామపంచాయతీలు బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్, సున్నం, దోమల లిక్విడ్, యాంటీ లార్వా వంటి వాటిని కొనుగోలు చేసి వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తలు చేపట్టడం సాధారణమే. కానీ బహిరంగ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా పడవేసే వ్యర్థాల కారణంగా వచ్చే దుర్వాసనతో పాటు వాటిని భుజించిన జంతువులు పశుపక్షాదుల ద్వారా సమాజానికి ఎదురయ్యే అనారోగ్య పరిస్థితులను దూరం చేయాలని భావించింది. ఈ సమస్యను బయోలాజికల్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్‌తో కొంతమేరకైనా పరిష్కరించుకోవచ్చని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గుర్తించారు. కలెక్టర్ సూచన మేరకు జిల్లా పంచాయతీ అధికారి ద్వారా బయోరికో కంపెనీకి చెందిన ఓడొర్ ఎలిమినేటర్ అనే పౌడర్ ప్యాకెట్లను గ్రామపంచాయతీలకు కొద్ది మొత్తంలో పంపిణీ చేసి ప్రయోగాత్మక ప్రయత్నానికి సిద్ధమవుతున్నారు.

ఎక్కడెక్కడ వాడతారు..

బయోరికో ఓడొర్ ఎలిమినేటర్ పౌడర్‌ను బకెట్ నీటిలో 5గ్రాములు కలిపి వ్యర్థాలపై చల్లా లి. లేదా పత్తిపంటలపై రసాయనాలను పిచికా రీ చేసినట్లుగానే చేయాలి. ముఖ్యంగా దుర్వాస న విపరీతంగా వచ్చే కోళ్ల ఫారాల వద్ద, గుట్టుచప్పుడు కాకుండా ఊరి శివార్లలో పడవేసే జంతు కళేబరాలపైనా, పెంట కుప్పలపైనా, భుజించిన తర్వాత పారవేసే వ్యర్థ ఆహార పదార్థాల కుప్పలపైన, కుళ్లిపోయిన వ్యర్థ పదార్థాల వద్ద వచ్చే దుర్వాసన అరికట్టేందుకు ఈ బయోరికో ఓడొర్ ఎలిమినేటర్ పౌడర్‌ను వాడనున్నట్లు తెలిసింది.

అన్ని జీపీలకు అందజేస్తున్నాం

బయోరికో ఓడొర్ ఎలిమినేటర్ పౌడర్ ప్యాకెట్లను జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలకు అందజేస్తున్నాం. ప్రధానంగా కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో వదిలే వ్యర్థాలను భుజించడం ద్వారా పిచ్చికుక్కలుగా మారి కాటు వేస్తున్న ట్లు ప్రాథమికంగా భావించాం. కుక్కలు లేదా ఇతర జంతువుల కళేబరాలతో వచ్చే దుర్వాసనను అరికట్టవచ్చు. అయితే ఈ బయోరికో ఓడొర్ ఎలి మినేటర్ ప్రాణాంత కం కాదని అది కేవ లం వ్యర్థాలను డీ కంపోజ్ మాత్రమే చేస్తుందని చెప్పారు. ఈ ఉత్పత్తికి సంబంధించిన కంపెనీ ప్రతినిధులు డెమో ఇచ్చిన తర్వాత వచ్చే ఫలితాలను బట్టి వీటి వాడకంపై ఓనిర్ణయానికి వస్తాం.

- వెంకయ్య, నల్లగొండ, డీపీవో

జనాభాను బట్టి ప్యాకెట్ల అందజేత

బయోరికో ఓడొర్ ఎలిమినేటర్ కేజీ పరిమాణం గల ప్యాకెట్లను ఇప్పటికే గ్రామపంచాయతీలకు చేరవేస్తున్నారు. గ్రామ పంచా యతీల్లోని జనాభా ప్రాతిపదికన వీటిని అందజేస్తున్నారు. ఉదాహ రణకు 10వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు నాలుగు ప్యాకెట్లు మూడు వేల జనాభా ఉన్న గ్రామపంచాయతీలకు మాత్రం ప్రస్తుతానికి ఒక ప్యాకెట్‌ను అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు వీటిని చేరవేసిన అనంతరం ఈ ప్యాకెట్ల వాడకం, ఉపయోగాలపై డెమో ఇవ్వనున్నారు. ప్రస్తుతానికి ఈ ప్యాకెట్లను గ్రామ పంచాయతీలకు చేరాయి. కానీ వీటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి పంపిణీ చేస్తుందా లేక ఫినాయిల్, బ్లీచింగ్ కొన్నట్లు మాదిరిగానే డబ్బులు వెచ్చించి గ్రామపంచాయతీలే కొనుగోలు చేయాలా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు.

'కల్యాణలక్ష్మి' చెక్కులు అందజేత

గట్టుప్పల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు తహసీల్దార్ కార్యాలయంలో రాములు పంపిణీ చేశారు. మండలంతో పాటు పలు గ్రామాలకు చెందిన 31మంది లబ్ధిదారులకు చెక్కులను మంగళవారం అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుకన్య, మాజీ సర్పంచులు నామ జగనాథం, సంపత్, రావుల రమేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నామని బుచ్చయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతుమ్మలగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండ సాగర్‌రెడ్డి షూ, టైబెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి రాజు, హెచ్‌ఎం జ్యోతి, యానాల లింగారెడ్డి, వంగాల శ్రీను, బత్తిని రాంబాబు, కొల్లు పరమేశ్‌రెడ్డి, నల్ల రాంరెడ్డి, వస్కుల నర్సింహ్మ, శ్రీను, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో నిత్య పూజలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న దుర్గయ్య

శాలిగౌరారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని శివాలయంలో నిత్య పూజలు చేయాలని శివాలయ కమిటీ మాజీ చైర్మన్ గుండా దుర్గయ్య కోరారు. జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. శాలిగౌరారం శివాలయానికి 12ఎకరాల భూమి ఉందని, భూమి వచ్చిన ఆదాయాన్ని ఆలయ ధర్మకర్తలు తీసుకొని నిత్య పూజలతో పాటు ప్రతీ సోమవారం ప్రత్యేక పూజలు చేయడం లేదన్నారు. తాను 2003 సంవత్సరంలో ఈ ఆలయానికి దేవాలయ చైర్మన్‌గా ఉండి గుడి అభివృద్ధికి తోడ్పడి 14మందితో శివ మాల వేయించడం ప్రారంభిచామని తెలిపారు. అప్పటినుంచి నేటి వరకు గుడి అభివృద్ధికి కృషిచేస్తున్నానని ప్రతీ సంవత్సరం శివరాత్రి సమయంలో 50మంది వరకు గ్రామస్థులు శివమాల ధరించి పూజలు చేస్తున్నారని తెలిపారు. అయన వెంట గుండా కోటీశ్వరయ్య ఉన్నారు.

పోటీ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ మ్యాథమెటిక్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా వారు ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయస్థాయి మ్యాథమెటిక్ ఒలంపియాడ్-2025లో నల్లగొండలోని ఓక్‌ట్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 30 విద్యార్థులు అన్ని విభాగాల్లో రెండో స్థాయికి అర్హత సాధించారు. వీరిలో 10మంది విద్యార్థులు ప్రైమరీ స్థాయిలో 13మంది సబ్‌జూనియర్, మరో 13మంది జూనియర్ స్థాయి అర్హత పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి హనుమంతరెడ్డి, డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి, ప్రిన్సిపాల్ వై. సునీల్‌రెడ్డి అభినందించారు.

క్రీడలతో శరీర దారుఢ్యం

మర్రిగూడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శరీర దారుఢ్యం పెరుగుతుందని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి సొంత ఖర్చులతో బహుమతులు అందజేశారు. ఈ క్రీడా కార్యక్రమంలో సిలివేరు విష్ణు, బిచ్చు నాయక్, పందుల పాండు, కృష్ణ, ప్రధానోపాధ్యాయులు పృథ్వీనాయక్, వాసేదేవారావు, కృష్ణ, బాలరాజు, జుబేదా, వేదావతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, కొప్పు శ్రవణ్, కల్లూరి కంఠ్లమహేశ్వర్, దండు రవి, అర్థం శ్రీనివాస్, ఎస్‌కే నస్నేసాహెబ్, సైదులు, రామచంద్రం, మహ్మద్ అలి, దండు నాగరాజు, శ్రీను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మర్రిగూడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని మరిగూడ సీఐ దూది రాజు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఎస్సీ కాలనీలో వినాయక విగ్రహ మండపాన్ని పరిశీలించారు. వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపాల వద్ద డీజేలు సౌండ్ సిస్టం ఏర్పాటుకు అనుమతులు లేవన్నారు. వినాయక విగ్రహాల వద్ద మండప నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటలలోపే పూజలు, సంస్కృతిక కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా పోలీసు శాఖకు దరఖాస్తులు చేసుకొని అనుమతులు పొందాలని అన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

శాలిగౌరారం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వ సీబీఐ విచారణను వ్యతిరేకిస్తూ శాలిగౌరారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మామిడి సర్వయ్య, కట్ట వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, చాడ హతీష్‌రెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

పంచాయతీ ఓటర్లు 10.73లక్షల మంది

(5వ పేజీ తరువాయి)

అంగన్‌వాడీ భవనాలు అనుకూలంగా ఉంటే రెండో లోకేషన్‌ను ఏర్పాటు చేశారు.

పరిషత్‌ల తర్వాతే పంచాయతీ ఎన్నికలు?

గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలు, పోలింగ్‌స్టేషన్ల వారీగా ఓటర్ల విభజన పూర్తి చేసిన అధికార యంత్రాంగం ఎన్నికలకు ప్రభుత్వం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఒకటి, రెండు రోజుల్లో జీవో ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈలోగా పరిషత్ ఎన్నికలకు సంబంధించి కూడా ఈనెల 6నుంచి ఓటర్ల జాబితా తుది రూపకల్పనకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈనెల 10న పరిషత్‌లకు సంబంధించి ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్లను ఖరారు చేసేందుకు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. రిజర్వేషన్ల పెంపు అంశంపై జీవో వచ్చిన వెంటనే తొలుత పరిషత్‌లకు సంబంధించి రిజర్వేషన్లు, ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని, వెనువెంటనే పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తుండడంతో రెండు ఎన్నికలకూ అధికార యంత్రాంగం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం ఏ ఎన్నికలు ముందు నిర్వహించాలంటే ఆ ఎన్నికలు నిర్వహిస్తూ, పక్షం రోజుల తేడాతో రెండో ఎన్నికలను సైతం జరిపేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

జిల్లాలోని గ్రామపంచాయతీలలో నమోదయిన ఓటర్ల వివరాలు

మండలం	పంచా	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అడవిదేవులపల్లి	13	108	7340	7334	0	14,674
అనుముల	24	202	11588	12207	1	23796
చందంపేట	30	250	15768	14910	1	30679
చండూరు	19	166	12137	12186	0	24323
చింతపల్లి	36	294	22418	22633	3	45054
చిట్యాల	18	180	17760	17975	0	35735
దామరచర్ల	35	302	20179	20732	3	40914
దేవరకొండ	41	316	17909	17806	1	35716
గట్టుప్పల	7	68	7832	7785	0	15617
గుడిపల్లి	12	104	6066	6205	0	12271
గుండ్లపల్లి	39	326	20660	20863	2	41525
గుర్రంపోడు	38	314	18947	19623	1	38571
కనగల్	31	262	18313	18579	0	36892
కట్టంగూరు	22	206	18565	18797	0	37362
కేతేపల్లి	16	160	15136	15947	1	31084
కొండమల్లేపల్లి	27	216	14992	14604	3	29599
మాడుగులపల్లి	28	238	14837	15686	0	30523
మర్రిగూడ	18	170	15146	15639	0	30785
మిర్యాలగూడ	46	394	27130	28042	8	55180
మునుగోడు	28	244	18990	19048	0	38038
నకిరేకల్	17	160	13283	13558	2	26843
నల్లగొండ	31	270	19167	20064	0	39231
నాంపల్లి	32	276	17886	18524	1	36411
నార్కట్‌పల్లి	29	262	21508	22263	1	43772
నేరేడుగొమ్ము	21	170	10304	9955	3	20262
నిడమనూరు	29	256	17516	18577	1	36094
పీఏపల్లి	25	216	13848	13790	6	27644
పెద్దవూర	28	244	16921	17564	9	34494
శాలిగౌరారం	24	230	19937	20448	3	40388
తిప్పర్తి	26	216	13467	14221	0	27688
త్రిపురారం	32	270	17963	18732	3	36698
తిరుమలగిరిసాగర్	35	288	17381	17690	4	35075
వేములపల్లి	12	116	9966	10602	0	20568
మొత్తం	869	7494	530860	542589	57	1073506

మూడు నెలలైనా పట్టించుకోలే..

● పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్ మురుగు ● దుర్వాసనతో స్థానికుల ఇబ్బంది ● చర్యలు తీసుకోని మున్సిపల్ అధికారులు

రామగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని సుందరంగా తీర్చిద్దుతామని పాలకులు చెప్పే మాటలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల ప్రగతి కళాశాల సమీపంలో ఉన్న మ్యాన్ హోల్ పగిలి కొన్ని నెలలుగా మురుగు నీరు పొంగిపొర్లుతోంది. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాస వెదజల్లుతోంది. మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో అక్కడ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. స్థానికులు, వాహనాదారులు ముక్కు మూసుకొని అక్కడి నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ మురుగునీరుకు అవుట్‌లెట్ సరిగ్గా లేకపోవడం, రోడ్డు వంపులో ఉండడంతో సమస్య ఏర్పడుతుందని స్థానికులు పేర్కొంటు న్నారు. రోడ్డును సమాంతరంగా చేసి అవుట్‌లెట్ కనెక్షన్‌ను సరిచేస్తే సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు సిద్ధమేనని స్థానికులు చెబుతున్నారు.


ప్రగతి కాలేజ్ సమీపంలో పొంగిపొర్లుతున్న మురుగునీరు

వర్షం వస్తే తీవ్ర ఇబ్బంది



ఇక్కడ మ్యాన్‌హోల్ పగిలి కొంతకాలంగా మురుగు నీరు రోడ్ల మీదకి వస్తుంది. ఇక వర్షం వస్తే ప్రాంతమంతా నీరు నిలుస్తోంది. మోకాల లోతు నీరు నిలబడడంతో చిన్నారులు, వృద్ధులు కనీసం నడవలేని పరిస్థితులు కూడా ఏర్పడింది. ఇక వర్షం వస్తే పరిస్థితి చెప్పరాదు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

● బండ బిక్షం

సమస్య పరిష్కారించకుంటే ధర్నా చేస్తాం



ఇక్కడ మ్యాన్‌హోల్ ద్వారా మురుగునీరు గత కొంత కాలంగా వస్తుంది. దీంతో ఈ ప్రాంతం కంపు మయంగా మారిపోయింది. ఇటు నుండి వెళ్లాలంటే ముక్కు ముసుకొని వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి, లేదంటే మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేసేందుకైనా సిద్ధంగా ఉన్నాం.

● జోరీగుల యాదగిరి

వినాయకుడికి 121రకాల నైవేద్యాలు

తిప్పర్తి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయకుడికి 121 రకాల నైవేద్యాలు సమర్పించి భక్తులు వేడుకలు జరుపుకున్నారు. తిప్పర్తి మండలకేంద్రంలో సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద సుమారు 150మందికి పైగా మహిళా భక్తులు నైవేద్యాలు సమర్పించారు. సంవత్సరానికి ఒకసారి జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని పూజలో పాల్గొన్న భక్తులు తెలిపారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గుండా సత్యనారాయణ, ఆలయ పూజారి అనంత శర్మ, భక్తులు పాల్గొన్నారు.


వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన 121 రకాల నైవేద్యాలు

మహాసభలను విజయవంతం చేయాలి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. సలీం కోరారు. జిల్లా మహాసభల పోస్టర్‌ను మంగళవారం అవిష్కరించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండెంపల్లి సత్తయ్య, సైదాచారి, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎంపీడీవో కార్యాలయాల్లో తుది ఓటరు జాబితా ప్రదర్శన

మునుగోడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మునుగోడు మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ తుది ఓటరు జాబితాను ప్రదర్శనకు నోటీసు బోర్డుపై ఉంచామని ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి తెలిపారు. వార్డుల వారీగా తయారు చేసి తయారు చేసిన ఓటరు జాబితాలో పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించామని పేర్కొన్నారు.

కట్టంగూరు: మండలంలోని 22 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు తన కార్యాల యంలో విడుదల చేశారు. మండలంలో మొత్తం 206 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం ఓటర్లు 37,362మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 18,565, స్త్రీలు 18,797 మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో స్వరూపరాణి, చలపతి, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

చండూరు రూరల్: మండలానికి చెందిన తుది ఓటరు జాబితా మంగళవారం మండల అభివృద్ధి అధికారి బి. యాదగిరి ప్రకటించారలు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోని నోటీస్ బోర్డుపై పూర్తి తుది ఓటరు జాబితాను గ్రామాల వారీగా ప్రకటించారు. మండలంలో మొత్తం 19 గ్రామపంచాయతీలకు మొత్తం 24,323 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 12,137 మంది ఓటర్లు, స్త్రీలు 12,186 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నర్సింహ, తదితరులున్నారు.


చండూరులో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

కేతేపల్లి: మండలంలోని 16గ్రామాలకు చెందిన తుది ఓటరు జాబితాలను ఎంపీడీవో బి.శ్రీనివాసరావు విడుదల చేశారు. గత నెల 30న డ్రాఫ్టు నోటిఫికేషన్‌లను విడుదల చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి ఓటరు జాబితాలో చోటు చేసుకున్న తప్పొప్పులను సరిచేసిన అనంతరం తుది ఓటరు జాబితాలను ప్రకటించారు. ఓటరు జాబితాలను మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీవో నాగమణి, ఎంపీడీవో కార్యాలయ అధికారులు భవాని, అరుణ, మాధవి పాల్గొన్నారు.

వైఎస్ ఆశయాలు సాధిస్తాం : ఎమ్మెల్సీ

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూ ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తామని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంలలో గల వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నల్లబోతు సత్తయ్య, బొడిగె సైదులు, చిరుమర్తి ధర్మయ్య, పల్లె నరేందర్‌రెడ్డి, మైల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఎస్ 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కత్తుల కోటి, కూసుకుంట్ల రాజిరెడ్డి, చిట్ల వెంకటేశం, మధుసూదన్‌రెడ్డి, శ్యాంసుందర్, గాదరి రవి, దొంతినేని నాగేశ్వరరావు, కిన్నెర అంజి పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ నపట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్ వైఎస్ వర్ధంతి నిర్వహించారు.

చిట్యాల : వైఎస్ వర్ధంతిని చిట్యాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు పోకల దేవదాస్, ఎద్దులపురి కృష్ణ, సాగర్ల గోవర్ధన్, బొబ్బల రాంరెడ్డి, ఎస్‌కే ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కనగల్: వైఎస్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండెబోయిన బిక్షంయాదవ్, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, వెంకటేశ్వర్‌రావ్, గోలి నర్సిరెడ్డి, రాజీవ్, జగాల్, కరీముల్లా, శ్రవణ్‌కుమార్, అంజయ్య, మండలి పరమేష్, రవి ఉన్నారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్‌పై ప్రత్యేక డ్రైవ్

● కొత్తపల్లి పరుశరాం, తహసీల్దార్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్)పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని నల్లగొండ తహసీల్దార్ కొత్తపల్లి పరుశరాం తెలిపారు. 2017 నుంచి ప్రారంభమైన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఇంటి పెద్ద మృతిచెందిన వారి కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం వివరాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. .

-(ఆంధ్రజ్యోతి-నల్లగొండ రూరల్)

ఆంధ్రజ్యోతి: ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం ప్రయోజనం ఏమిటి?

తహసీల్దార్: కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతిచెందితే ఆ కటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది.

ఆంధ్రజ్యోతి: ఎవరు అర్హులు?

తహసీల్దార్ : బీపీఎల్ కుటుంబానికి చెందిన వారై ఉండాలి.

ఆంధ్రజ్యోతి : కేంద్ర ప్రభుత్వం ఎంత సాయం అందజేస్తుంది.

తహసీల్దార్ : ఈ పథకం ద్వారా రూ.20వేలు అందిస్తుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.60 వేలు మించకుండా ఉండాలి. 18నుంచి 59 వయస్సు మధ్య వారై ఉండాలి.

ఆంధ్రజ్యోతి: దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన ధ్రువ పత్రాలు?

తహసీల్దార్ : 12-04-2017 తర్వాత మృతిచెందిన వ్యక్తి డెత్ సర్టిఫికెట్, మృతుడి ఆధార్‌కార్డు జిరాక్స్, రేషన్‌కార్డు, మృతుడి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులుతో దరఖాస్తు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి?

తహసీల్దార్ : నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో, గ్రామాల్లో గ్రామ కార్యదర్శి, పట్టణాల్లో వార్డు ఆఫీసర్‌లకు దరఖాస్తులు ఇవ్వవచ్చు.

ఓటు హక్కు కల్పించాలి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు తొలగించారని తమకు తిరిగి ఓటు హక్కును కల్పించాలని చెన్నుగూడెం గ్రామానికి చెందిన ఖమ్మం చిన్న ఇద్దయ్య, ఖమ్మం లక్ష్మమ్మ, ఖమ్మం శ్రీకాంత్, బడుపుల శ్రీకాంత్ కోరారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. చిన్న ఇద్దయ్య మాట్లాడుతూ తాను చెన్నుగూడెం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నానని తెలిపారు. వేరే గ్రామంలో ఓటు హక్కులేదని కావాలని పంచాయతి కార్యదర్శి, మండల అధికారి తొలగించారన్నారు. ఎలాంటి నోటీసు లేకుండా ఓటు హక్కుల తొలగించారన్నారు. కార్యక్రమంలో చెన్నుగూడెం మాజీ సర్పంచ్ శ్రీలత జంగయ్య, బీఆర్ఎస్ నాయకులు గుండెబోయిన జంగయ్య, సైదులు ఉన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా రాఘవేంద్రయాదవ్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా నెల్లికంటి రాఘవేంద్రయాదవ్ ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా నామ రాంప్రసాద్, మేరి కడారి, గణేష్‌యాదవ్, సభ్యులుగా తలారి రాంబాబు, నకరికంటి కళ్యాణ్ గౌడ్, బోగోజు మహేశ్వరచారి, వజ్రగిరి అంజయ్య, వెంకటయ్య ఏకలవ్య, పుల్లెంల శంకర్, కాసుల అజయ్, తరిఎల్లయ్య, యాతాకుల వెంకన్న, పీటల శంకర్, నీలకంఠం నాయక్, సయ్యద్‌ను ఎన్నుకున్నారు. కళ్యాణ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కో కన్వీనర్ రాసాల వినోద్ యాదవ్, నాయకులు బరిగల దుర్గాప్రసాద్, రాజశేఖర్, నగేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండలోని అలివేలుమంగా కాలనీలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


గట్టుప్పల్‌లో పూజల్లో పాల్గొన్న సీఐలు ఆదిరెడ్డి, శంకర్, తహసీల్దార్ రాములు


నల్లగొండ శ్రీనగర్‌కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు


హనుమాన్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, నాగరాజు

చవితి సందడి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయత్రం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు బండారు ప్రసాద్, బొజ్జనారాజు, గుర్రం వెంకన్న, వీరమళ్ళ భాస్కర్, యాదవ్ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజుయాదవ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేదర్‌రెడ్డి, సరికొండ రాజు, గుండెబోయిన సురేయాదవ్, సిలువేరు నగేష్, శివ, వెంకన్న పాల్గొన్నారు. అలివేలుమంగాకాలనీలో గుండపనేని కిషన్‌రావు సుభాషిని దంపతులు పూజలు నిర్వ హించారు. కార్యక్రమంలో చెనగోని ముత్తయ్యగౌడ్, ధర్మారెడ్డి, వెంకటరామిరెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, పర్వతం ప్రకాష్, జూలకంటి దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గట్టుప్పల్: మండల కేంద్రంలో సిద్ధార్థ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం సీఐలు ఆదిరెడ్డి, శంకర్, తహసీల్దార్ రాములు, మాజీ సర్పంచ్‌లు నామని జగన్నాథం, వీరమల్ల శ్రీశైలం గౌడ్, కంచుకంట్ల సంపత్, ఏఎస్ఐ అంజయ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీమగాని జంగయ్య, బండారు నవీన్, పగిల్ల రమేష్, కర్నాటి మురళి, ఏలే మల్లికార్జున్, బీమగాని కిరణ్, లక్కు నరేష్, పగిల్లా గణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 22.6
నల్లగొండ
5
బుధవారం 3 సెప్టెంబరు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.80 (299.7430)	1,88,938	1,88,938
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.75 (4.13)	2,530.24	2,679.72
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.6174 (37.8181)	1,79,000	1,76,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220



పంచాయతీ ఓటర్లు 10.73లక్షల మంది

- ఓటర్ల తుదిజాబితా విడుదల
- 869 పంచాయతీల్లో 7,494 వార్డులు

నల్లగొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో సహా ఓటర్ల తుదిజాబితా వెలువడింది. జిల్లాలో 33 మండలాల్లోని 869 గ్రామపంచాయతీలకు, 7,494 వార్డుల్లో 10,73,506 మంది ఓటర్లు నమోదయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 28 నుంచి ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సంఘం సూచించిన ప్రకారం జిల్లాలో తుది ఓటర్ల జాబితా వెలువరించిన అధికారులు, రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సైతం అందుబాటులో ఉంచారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక గ్రామపంచాయతీలతో పాటు, అత్యధిక ఓటర్లు కలిగిన జిల్లాగా నల్లగొండకు స్థానం దక్కిందని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తెలిపారు.

అత్యధిక ఓటర్లు మిర్యాలగూడ మండలంలో

జిల్లాలోని గ్రామపంచాయతీల్లో మొత్తం 10,73,506 మంది ఓటర్లు నమోదుకాగా,అందులో అత్యధికంగా మిర్యాలగూడమండలంలో 55,180 మంది ఓటర్లు ఉన్నారు.అత్యల్పంగా గుడిపల్లి మండలంలో 12,271 మంది ఓటర్లు నమోదయ్యారు.అత్యధికంగా మిర్యాలగూడలో 46పంచాయతీలుంటే, అత్యల్పంగా గట్టుప్పల్‌లో ఏడు గ్రామపంచాయతీలు ఉన్నాయి.

ఒకే వార్డులో కుటుంబ సభ్యుల ఓట్లు

గతానికి భిన్నంగా ఈసారి పంచాయతీ ఓటర్ల జాబితాలను అధికారులు పకడ్బందీగా రూపొందించారు. వార్డుల వారీగా పక్కా జాబితాలు ఫొటోలతో సహా ఓటర్లను నమోదు చేశారు. అంతేగాక ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా రూపొందించారు. ఇంటిపక్క ఇళ్ల ఉన్న వారు ఓట్లు కూడా ఒకే వార్డులో ఉండేలా చూడడంతో పాటు, వార్డుకు కేటాయించిన ఓటర్లకు మించిన చోట ఒకటి, రెండు ఇళ్ల ఎక్కువ తక్కువ ఉన్నా ఆ వీధి, లేక వాడ అంతా ఒకేవార్డులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు దాదాపు రెండు నెలలుగా ఈ కసరత్తును నిర్వహించారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. చిన్న పంచాయతీలకైతే ఒకే లోకేషన్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. 1,000 ఓట్లు దాటిన చోట ప్రభుత్వ స్కూళ్లతో పాటు, గ్రామపంచాయతీభవనాలు..

- మిగతా 8వ పేజీలో...

ఓటరు జాబితాలను ప్రచురించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలను ప్రచురించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఇందిరమ్మ ఇళ్లు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, వీధి కుక్కలు తదితర విషయాలను ఆమె సమీక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో తొలి ఓటరు జాబితాను ప్రచురించాలన్నారు. ఎక్కడైనా తాత్కాలిక పోలింగ్ కేంద్రాలు అవసరం ఉంటే ప్రతిపాదించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులతో దరఖాస్తు చేయించాలన్నారు. సమీక్షలో ఆర్డీవో రమణారెడ్డి, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అందరూ అర్హులే

(ఆంధ్రజ్యోతి, డిండి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అంతా అర్హులేనని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం డిండి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి 2017, ఏప్రిల్ 1 తరువాత మృతిచెందిన వారని అర్హులని, వారు మరణించేనాటికి 18 నుంచి 59 సంవత్సరాలలోపు వయసు ఉండాలన్నారు. మండలంలో 579 మొత్తం దరఖాస్తులు రాగా, 152 పరిశీలించినట్లు తెలిపారు. దేవరకొండ డివిజన్‌లో 4వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. మండలంలో 326 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 41,525 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకన్న, ప్రతేకాధికారి లక్ష్మీ ఉన్నారు.

నిమజ్జనానికి పటిష్ఠ భద్రత

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం స్థానిక వల్లభరావు చెరువును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, పోలీసులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిమజ్జన ప్రాంతానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్, బారికేడ్లు, క్రేన్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, తదితర ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



డిండి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సర్వర్ బిజీ

- ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ కష్టాలు
- ఆలస్యానికి చెల్లుచీటీ
- ఇప్పటికే విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలు



చిట్యాల జడ్పీహెచ్ఎస్‌లో యాప్‌లో హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయురాలు

విద్యాశాఖలో ఇప్పటికే విద్యార్థులకు అమలు చేస్తున్న ఫేసియల్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ఉపాధ్యాయులకూ అమలులోకి వచ్చింది. ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలలకు హాజరయ్యేలా ఈ విధానాన్ని అమలుచేస్తుండగా, టీచర్ల ఆలస్యపు హాజరుకు చెల్లుచీటీ పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఉదయం 9.05గంటలకే ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉండగా, ఉపాధ్యాయులు ఉరుకులు పరుగులతో పాఠశాలలకు చేరుకుంటున్నారు. అంతా ఒకేసారి యాప్ వినియోగిస్తుండటంతో సర్వర్ బిజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ యాప్‌లో లోకేషన్, ఇంటర్నెట్ ఆధారంగా హాజరు నమోదవుతుండటంతో కనెక్టివిటీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా ఈ యాప్‌తో ఇబ్బందులు, ప్రయోజనాలు వెలుగుచూశాయి.

- **పెద్దఅడిశర్లపల్లి:** మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలలో 19 మంది ఉపాధ్యాయులు 15 మంది ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేశారు. మిగతావారి నమోదులో ఇబ్బదులు ఎదురయ్యాయి.
- **డిండి:** మండలం వావిల్‌కోల్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు 9.11 గంటలకు, మరో ఉపాధ్యాయుడు జి.సుధాకర్ 10.30గంటలకు హాజరయ్యారు. ఎర్రగుంటపల్లి పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు 9.50గంటలకు హాజరయ్యారు.
- **దేవరకొండ:** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 27 మంది ఉపాధ్యాయులు ఉండగా, సిగ్నల్స్, సర్వర్ మొరాయించడంతో 9.30గంటల వరకూ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదుకాలేదు.
- **నేరేడుగొమ్ము:** ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా, సర్వర్ సమస్య కారణంగా సకాలంలో హాజరు అప్‌లోడ్ కాలేదు.
- **కొండమల్లేపల్లి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 879 ఉండగా, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల హాజరుకే 45 నిమిషాల పూర్తి పీరియడ్ పడుతోంది. ఒక్కోసారి సిగ్నల్స్ రాక ఇబ్బందులు ఎదురయ్యాయి.
- **మిర్యాలగూడ రూరల్:** మండలంలోని గూడూరు ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు నమోదుచేశారు.
- **చిట్యాల, చిట్యాల రూరల్:** మండలం పెద్దకాపర్తి జడ్పీ హెచ్ఎస్‌లో సర్వర్, సిగ్నల్స్ సమస్యతో ఇబ్బందులు ఎదురయ్యాయి. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు యాప్‌లో అటెండెన్స్ అప్‌లోడ్ చేయడానికి ప్రయత్నించగా సర్వర్ బిజీ వచ్చింది.
- **నార్కట్‌పల్లి:** మండలంలో 'యువర్ ఇంటర్నెట్ కనెక్షన్ సీమ్స్ టు బీ ప్రాబ్లం' అంటూ డిస్‌ప్లే రావడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- **కేతేపల్లి:** మండలంలోని ఉప్పలపహాడ్ ప్రాథమిక పాఠశాలలో సగం మంది ఉపాధ్యాయులు చివరి నిమిషంలో పాఠశాల ఆవరణలోకి పరుగులు తీస్తూ ఎఫ్ఆర్ఎస్ నమోదుచేశారు. ప్రార్థన సమయం అవుతున్నా నిలిపి ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేశారు.

'కాళేశ్వరం'పై మొదట మాట్లాడిందే రాజగోపాల్‌రెడ్డి

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే సహించం
- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



నల్లగొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై మొదటగా మాట్లాడి సమాజానికి తెలియజేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేసేవారిని సహించేది లేదని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజల కోసం కాకుండా, తమ కమీషన్ల కోసమే నిర్మిస్తున్నారని అసెంబ్లీ సాక్షిగా వెల్లడించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సోషల్‌మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన పత్రిక ప్రచురించిన తీరుగా మార్పులుచేసి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వైనాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇదంతా బీఆర్ఎస్ శిబిరం నుంచి వస్తున్న దుష్ప్రచారమని అన్నారు. ప్రధాన పత్రికను తలపించేలా 'కాళేశ్వరంలో అవినీతి జరగలేదు' అని రాజగోపాల్‌రెడ్డి మాట్లాడినట్లు వార్త సృష్టించి సోషల్ మీడియాలో పెట్టించిన వారికి తగిన సమయంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం దోచుకుతింటుంటే వారికి తగిన బుద్ధి చెప్పడానికి తన పదవినే వదులుకున్న చరిత్ర కలిగిన రాజగోపాల్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంట్రాక్టర్ల కోసమే నిర్మిస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి మొదటగా మీడియాలో మాట్లాడారని అన్నారు. అవినీతి జరగలేదని ఎలా మాట్లాడుతారని, ఆ మాత్రం స్పృహలేకుండా సోషల్‌మీడియాలో పిచ్చిరాతలు రాయిస్తే ప్రజలు రాళ్లతో తరిమికొడతారని హెచ్చరించారు.



మునుగోడు కేజీబీవీలో వివరాలు తెలుసుకుంటున్న డీఈవో భిక్షపతి

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

డీఈవో భిక్షపతి

మునుగోడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన ప్రకారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం విధిగా అందించాలని డీఈవో భిక్షపతి ఆదేశించారు. మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు స్థానిక పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఆయా పాఠశాలల్లో తరగతి గదులు, వంట గదుల్లో నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం, విద్య అందుతోందా అని విద్యార్థులను ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, లేదంటే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను, వంట ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న ఖమ్మంపాటి శంకర్

ఎస్ఎఫ్ఐ ఆలిండియా కమిటీ సభ్యుడు శంకర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆలిండియా కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 2019-20 నుంచి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను బకాయి ఉంచిందన్నారు. 2024 వరకు సుమారు రూ.5,358కోట్లు బకాయిలు ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ మొత్తం రూ.8,158కోట్లకు చేరిందన్నారు. దీంతో పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించేందుకు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు బకాయిలు చెల్లించలేదన్నారు. దీంతో ప్రైవేట్ కళాశాలలు, విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, బుడిగ వెంకటేశ్, కోరే రమేష్, ముస్కు రవీందర్, రవి, మారుపాక కిరణ్, స్పందన, జగన్‌నాయక్, జగదీష్, పెద్ది రాములు, వీరన్ననాయక్, నవదీప్, రాకేష్, నవదీప్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని రోడ్లకు నిధులు కేటాయించాలి

మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బీటీ, అంతర్గత రోడ్లకు నిధులు కేటాయించాలని ఆర్అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే బాలునాయక్ మర్యాదపూర్వకంగా కలిసి నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, తదితరులు ఉన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఎమ్మెల్యే బాలునాయక్

నేడు జిల్లాస్థాయి కళాఉత్సవ్

నల్లగొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఈనెల 3న ఉదయం 9.30గంటల నుంచి జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలకు చెందిన 9వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అర్హులని తెలిపారు. గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, సినీ కళలు, చిత్రలేఖనం, బొమ్మల తయారీ, హరికథ, బుర్రకథ వంటి 12 కళారూపాలను ఈ పోటీల్లో ప్రదర్శించవచ్చని తెలిపారు. ప్రతీ కళారూపానికి ఒకరి చొప్పున ఎంపిక చేసి విజేతలను రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు పంపుతామని చెప్పారు. కళారూప ప్రదర్శనకు సంబంధించిన సామగ్రిని విద్యార్థులే వెంటతెచ్చుకోవాలని సూచించారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి జడ్చర్ల-కోదాడ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు విస్తరణలో భాగంగా కొలతలు వేసి మార్క్ చేసిన కట్టడాలను పరిశీలించారు. సెట్ బ్యాక్ ఉందా? లేదా? అనే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విస్తరణలో భాగంగా కట్టడాలను కోల్పోతున్న భవన యజమానులకు పరిహారం అందిందా అని ఆరా తీశారు. పట్టణ ప్రజల భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టిన రోడ్డు విస్తరణకు పరిహారం పొందిన యజమానులు నిర్మాణాలు తొలగించి సహకరించాలని కోరారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హస్ ఎదుట అంబేడ్కర్ భవన నిర్మాణానికి గుర్తించిన స్థలంలో అంబేడ్కర్ విగ్రహం, వాటర్ ఫౌంటెన్ నిర్మించనున్నట్లు తెలిపారు. సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ, పరిహారం పొందిన భవనాల యజమానులు నిబంధనల మేరకు భవనాలు తొలగించడంతో పాటు సెట్‌బ్యాక్ వదిలి కొత్త నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు భూయజమానులకు రూ.33కోట్ల పరిహారం చెల్లించామన్నారు. వారసత్వ వివాదాల కారణంగా మరో రూ.6కోట్ల చెల్లింపులు నిలిచాయని, పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి ఆ మొత్తాన్ని కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ, సర్వేయర్ ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

వాట్సా‌ప్‌లో ఆర్టీసీ టికెట్ బుకింగ్

- హైదరాబాద్‌లోని మియాపూర్, కంటోన్మెంట్ డిపోల్లో పైలట్ ప్రాజెక్టు

6

వ్యర్థాల దుర్వాసనకు చెక్

- బయోరికో ఓడౌర్ ఎలిమినేటర్ల పంపిణీ

7

పెద్దవూర తహసీల్దార్‌గా శాంతిలాల్

పెద్దవూర, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దవూర తహసీల్దార్‌గా బి.శాంతిలాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనుముల మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న వై.రాము అనుముల నాయబ్ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. శాంతిలాల్‌కు కార్యాలయ సిబ్బంది టీఆర్ టీయూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

త్రిపురారం సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాబుసాయిపేట గ్రామంలో సీఆర్ఆర్ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ కలగాని శ్రవణ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గట్టు యాదగిరి, కస్తూరి ఆనంద్, గోపగాని చిన్న మట్టయ్య, షేక్ బిక్‌మియా తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

నిడమనూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలంలో తుది ఓటరు జాబితాను మండల పరిషత్ అధికారులు మంగళవారం విడుదల చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెల 28న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయగా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరించి తుది ఓటరు జాబితాను మంగళవారం వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తుది జాబితాను ఓటర్లకు అందుబాటులో ఉంచారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను 256 వార్డులు ఉన్నాయి. తుది ఓటరు జాబితా ప్రకారం మండలంలో మొత్తం 36,094 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 17,516 మంది కాగా మహిళలు 18,577 మంది ఉన్నారు. పురుషుల కంటే 1,061 ఓట్లు మహిళలవి అధికంగా ఉన్నాయి. బంకాపురం, గుంటిపల్లి, సోమారిగూడెం మినహా మిగతా 26 గ్రామ పంచాయతీల్లో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నా యి. అదేవిధంగా ఒక్కరు ట్రాన్స్‌జెండర్ కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5320 ఓట్లతో నిడమనూరు మేజర్ పంచాయతీగా ఉండగా, 477 ఓట్లతో ఎర్రగూడెం గ్రామ పంచాయతీ చిన్నదిగా ఉంది. నిడమనూరు మేజర్ పంచాయతీ తర్వాత 2308 ఓట్లతో తుమ్మడం, 1999 ఓట్లతో ముకుందాపురం పంచాయతీలు పెద్దవిగా ఉన్నాయి. అదే విధంగా నిడమనూరు మేజర్ గ్రామ పంచాయతీలో 14 వార్డులు, బొక్కమంతలపహాడ్, ము ప్పా రం, ముకుందాపురం, తుమ్మడం, నారమ్మగూ డెం, రాజన్నగూడెం, శాఖాపురం, ఊట్కూరు, ఎర్రబెల్లి పంచాయతీల్లో 10 వార్డుల చొప్పున ఉండగా మిగతా పంచాయతీల్లో 8 వార్డుల చొప్పున ఉన్నాయి.



పెద్దవూరలో తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీవో ఉమాదేవి, సిబ్బంది

● పెద్దవూర : మండలంలోని 28 గ్రామపంచాయతీల తుది ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి మంగళవారం విడుదల చేశారు. ఆగస్టు 28న ముసాయిదా జాబితాను విడుదల చేసిన అధికారులు వివిధ పక్షాల అభ్యంతరాలను స్వీకరించి సవరించిన అనంతరం జాబితాను ప్రకటించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హఫీజ్, సీనియర్ అసిస్టెంట్ పంకజ్‌రెడ్డి, కార్యదర్శులు విజయ్‌కుమార్, వర్కాల శ్యాంసుందర్‌రెడ్డి, వర్ర నాగిరెడ్డి, ఉడ్తూరి రవీందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి : ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం గత నెల 28న ఓటరు ముసాయిదా జాబితా ప్రకటించగా ఆయా రాజకీయపార్టీల నాయకులు వినతులను పరిగణలోకి తీసుకోని ఓటరు జాబితాలో తప్పులను సరిచేసి తుది ఓటరు జాబితాను మంగళవారంఎంపీడీవో మాతంగి రమేష్ కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. గ్రామపంచాయతీల వార్డుల వారీగా ఆ యా గ్రామాలతోపాటు ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ గుణవేణి శ్రీనివాస్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం 4వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల నుంచి వెలువడు వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్తను కాల్వలలో వేయడం కారణంగా మురుగు నీరు నిలుస్తుందని, తద్వారా దోమల సంచారం పెరుగుతుందన్నారు. అన్నివార్డుల్లో ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వార్డుల వారీగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఎస్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడ పోటీల్లో సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణనాయక్ మాట్లాడుతూ అండర్ -17 ఖోఖో, వాలీబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. కబడ్డీలో ద్వితీయస్థానం, అండర్ -14 ఖోఖో పోటీల్లో ప్రథమస్థానంలో నిలవడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందమూరి హరికృష్ణ సేవలు చిరస్మరణీయం



హరికృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నందమూరి హరికృష్ణ సేవలు చిరస్మరణీయమని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. హరికృష్ణ వర్ధంతి సభను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిగా హరికృష్ణ తెలుగు రాష్ట్రాలకు అందించిన సేవలు గొప్పవన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిలకల వెంకన్న, ఏచూరి అనంతరాములు, దాసోజు కాంతాచారి, నూకపంగు కాశయ్య, పోట్ల శంకర్‌రావు, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్, చిత్రంలో ఏడీ వెంకట్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రేబీస్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్క కాటుకు గురైతే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే టీకాలు వేయించుకోవాలని సూచించారు. కుక్కలు వెంటబడితే తమని తాము ఎలా రక్షించుకోవాలన్న అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, డాక్టర్ శంకర్‌రావు, వెంకటరమణ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులంతా ఏకం కావాలి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి మున్నూరు కాపులంతా ఏకం కావాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పందిరి వేణు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా కులస్థులందరూ ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కంచి సత్యనారాయణ, కనపర్తి సత్యప్రసాద్, గోపగాని విజయభాస్కర్, ముత్యాల సత్యనారాయణ, రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలు అందించాలి: సీఐటీయూ

హాలియా,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం హాలియాలోని మార్కెట్ యార్డ్‌లో మిల్క్ సెంటర్, పాలు పట్టే కార్మికులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేకువ జామునే రైతు ల వద్ద నుంచి పాలను సేకరించి పల్లెల్లో, పట్టణాల్లో ప్రజలందరికీ ఇంటింటికీ పాలు పోస్తూ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తున్న పాల కార్మికులకు లీటర్‌కి రూ. ఐదు బోనస్ ధర ప్రభుత్వం అందించాలన్నారు. కార్యక్రమంలో మానుపాటి విజయ్, కేతావత్ వెంకటేశ్వర్లు, శీలం లింగయ్య, ఎర్రబోయిన వెంకటేశ్వర్లు, ఈశ్వర్, శ్రీనివాస్, మల్లయ్య, యశ్వంత్, సూరిబాబు, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం

వేములపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌ఎస్సీ కాలనీకి చెందిన కోపాకుల నాగరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో అతడి స్నేహితులు రూ.18వేలు సేకరించి మంగళవారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉగ్గె శివ, యాసీన్, వెంకన్న, అశోక్, రాజు పాల్గొన్నారు.



నాగరాజు కుటుంబానికి డబ్బులు అందజేస్తున్న స్నేహితులు

మండపాల వద్ద భక్తులకు అన్నదానం

వేములపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలో దుర్గా ఈశ్వర్ యూత్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించగా ఆమనగల్లు గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో పిల్లల సందీప్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉగ్గె మునీశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చింతపల్లి : చింతపల్లి మండలంలోని గొడకొండ్ల గ్రామంలోని సిద్ధివినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని ముందు పుదీనా దండతో సహస్రనామావళి పఠించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. దీంతో ప్రజలు విషజ్వరాలు వ్యాపించి రోగాలతో ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. సాగు అవసరాలకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం వన్ టౌన్, టూటౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతం రెడ్డి, బావాండ్ల పాండు, సీనియర్ నాయకులు సత్యనారాయణ, గాదె పద్మ, తిరుపతి రాంమూర్తి, ఎండీ అంజద్, పిల్లుట్ల సైదులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

●మాడ్గులపల్లి : సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మండలంలోని సమస్యలపై కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, నాగమణి, కృష్ణయ్య, కన్నయ్య, వెంకటాచారి పాల్గొన్నారు.



మాడ్గులపల్లిలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

● దామరచర్ల : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్, నాయకులు పాపానాయక్, దయానంద్, ఖాజా మోహిద్దీన్, వెంకటయ్య, దుర్గయ్య, శ్రీను, మట్టయ్య, శ్రీహరి, శాంతమ్మ, కరీముస్నీసా, పిచ్చయ్య, హనుమంతు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కుట్రలు సరికాదు

చింతపల్లి, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలోని నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రాష్ట్ర రహదారిపై బైఠాయించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పక్కనబెట్టి కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, వింజమూరి రవి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, ఉపాధ్యక్షుడు ఎల్లంకి అశోక్, మహిళా విభాగం అధ్యక్షురాలు పున్ రెడ్డి సుమతి రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు ముర్రు రామారావు, కొండల్ నాయక్, జిట్ట జగదీష్, రఘురాంరావు, సీమర్ల శ్రీనుయాదవ్, పురుషోత్తం పాల్గొన్నారు.



చింతపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైఎస్ఆర్ సేవలు మరువలేనివి



మిర్యాలగూడ: వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక బంగారుగడ్డలోని ఆయన విగ్రహానికి పూలమా వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెబాట, నగరబాట, రైతుబాట, ప్రాజెక్టుల బాట వంటి కార్యక్రమాలతో ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ ప్రజాహిత కార్యక్రమాలు ఎన్నో అమలు చేశారని గుర్తు చేశారు. ఆయన మార్గంలో నేతలందరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, బెజ్జెం సాయి, గోదాల జానకిరాంరెడ్డి, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

● దేవరకొండ : మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యూనుస్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్, నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, రాజు, సైదులు, అశోక్‌గౌడ్, లక్‌పతి, హరినాయక్, పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం వైఎస్ఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకవచ్చారన్నారు కార్యక్రమంలో అభిమానులు పుల్లారావు, సురేష్, విజయ్‌కుమార్ , బాలాజీ, బద్రి, రమణ, ఎర్రబోయిన రాజు, కార్తీక్, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఓటర్లు 10.73లక్షల మంది

(5వ పేజీ తరువాయి)

అంగన్‌వాడీ భవనాలు అనుకూలంగా ఉంటే రెండో లోకేషన్‌ను ఏర్పాటు చేశారు.

పరిషత్‌ల తర్వాతే పంచాయతీ ఎన్నికలు?

గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలు, పోలింగ్‌స్టేషన్ల వారీగా ఓటర్ల విభజన పూర్తి చేసిన అధికార యంత్రాంగం ఎన్నికలకు ప్రభుత్వం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఒకటి, రెండు రోజుల్లో జీవో ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈలోగా పరిషత్ ఎన్నికలకు సంబంధించి కూడా ఈనెల 6నుంచి ఓటర్ల జాబితా తుది రూపకల్పనకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈనెల 10న పరిషత్‌లకు సంబంధించి ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్లను ఖరారు చేసేందుకు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. రిజర్వేషన్ల పెంపు అంశంపై జీవో వచ్చిన వెంటనే తొలుత పరిషత్‌లకు సంబంధించి రిజర్వేషన్లు, ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని, వెనువెంటనే పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తుండడంతో రెండు ఎన్నికలకూ అధికార యంత్రాంగం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం ఏ ఎన్నికలు ముందు నిర్వహించాలంటే ఆ ఎన్నికలు నిర్వహిస్తూ, పక్షం రోజుల తేడాతో రెండో ఎన్నికలను సైతం జరిపేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

జిల్లాలోని గ్రామపంచాయతీలలో నమోదైన ఓటర్ల వివరాలు

మండలం	పంచా	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అడవిదేవులపల్లి	13	108	7340	7334	0	14,674
అనుముల	24	202	11588	12207	1	23796
చందంపేట	30	250	15768	14910	1	30679
చండూరు	19	166	12137	12186	0	24323
చింతపల్లి	36	294	22418	22633	3	45054
చిట్యాల	18	180	17760	17975	0	35735
దామరచర్ల	35	302	20179	20732	3	40914
దేవరకొండ	41	316	17909	17806	1	35716
గట్టుప్పల	7	68	7832	7785	0	15617
గుడిపల్లి	12	104	6066	6205	0	12271
గుండ్లపల్లి	39	326	20660	20863	2	41525
గుర్రంపోడు	38	314	18947	19623	1	38571
కనగల్	31	262	18313	18579	0	36892
కట్టంగూరు	22	206	18565	18797	0	37362
కేతేపల్లి	16	160	15136	15947	1	31084
కొండమల్లేపల్లి	27	216	14992	14604	3	29599
మాడుగులపల్లి	28	238	14837	15686	0	30523
మర్రిగూడ	18	170	15146	15639	0	30785
మిర్యాలగూడ	46	394	27130	28042	8	55180
మునుగోడు	28	244	18990	19048	0	38038
నకిరేకల్	17	160	13283	13558	2	26843
నల్లగొండ	31	270	19167	20064	0	39231
నాంపల్లి	32	276	17886	18524	1	36411
నార్కట్‌పల్లి	29	262	21508	22263	1	43772
నేరేడుగొమ్ము	21	170	10304	9955	3	20262
నిడమనూరు	29	256	17516	18577	1	36094
పీఏపల్లి	25	216	13848	13790	6	27644
పెద్దవూర	28	244	16921	17564	9	34494
శాలిగౌరారం	24	230	19937	20448	3	40388
తిప్పర్తి	26	216	13467	14221	0	27688
త్రిపురారం	32	270	17963	18732	3	36698
తిరుమలగిరిసాగర్	35	288	17381	17690	4	35075
వేములపల్లి	12	116	9966	10602	0	20568
మొత్తం	869	7494	530860	542589	57	1073506

ఉపాధ్యాయ దినోత్సవానికి నిధులు మంజూరుపై హర్షం

పెద్దవూర, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై అవార్డి టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రామనాయక్, నన్నూరి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి మండల, జిల్లా స్థాయిలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించడానికి మండలానికి రూ. 5వేలు, జిల్లాకు రూ.15వేల చొప్పున నిధులు అందించడం ఎంతో అభినందనీయమన్నారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

అడవిదేవులపల్లి, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో అభిమానులు, జనసేన కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కోట్రా గోవర్ధన్ కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కనకయ్య, జానిపాషా, భార్గవ్, అనిల్, మసూద్‌బాషా, కరుణాకర్, రాజేష్, బ్రహ్మయ్య శివ పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డు విడుదల



పోస్ట్ కార్డు విడుదల చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాలని ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ అన్నారు. ఓట్‌చోరీ ఘటనపై ప్రజల ముందు వాస్తవాలను ఉంచాలని డిమాండ్‌చేశారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పిలుపు మేరకు ఓటు చోరీ హఠావో-ప్రజాస్వామ్యం బచావోలో భాగంగా మంగళవారం వీటీ.నగర్ భారతి డిగ్రీ కళాశాలలో పోస్టు కార్డును విడుదల చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, సురేష్, రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు బిల్లులు చెల్లించాలి: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య

చింతపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీ నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రైతులకు చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంల నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలోని వేలాది మంది రైతులకు మదర్‌డెయిరీ నుంచి సుమారు రూ.40 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే పరిశీలించి నిధులు మంజూరు చేయాలన్నారు. రైతలకు యూరియా కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు సరిపడా యూరియాను అందించలేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు పోలే యాదయ్య, ఉడుగుంట్ల రాములు, ఎండి.సర్ధార్, నరసింహగౌడ్, పి.మదార్ పాల్గొన్నారు.